


నేటి ప్రభాత
# సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784.

## నేటి నుంచి సంక్షేమ పథకాల జోష్



అవతరణ దినోత్సవం నేపథ్యంలో కొత్త పథకాలు
రాజీవ్ యువ వికాసానికి ప్రొసీడింగ్స్
రైతులకు ఫౌండేషన్ సీడ్ పంపిణీ మిగతా 2లో..

ప్రచురణ, హైదరాబాద్, సంపుటి : 01 సంచిక : 72 ఎడిటర్ : పాలగోని రాజేష్ పేజీలు : 8, వెల రూ. 4, /- సోమవారం - 02 - జూన్ - 2025

### అయోధ్య రామమందిరాన్ని దర్శించనున్న
## నూతన మిస్ వరల్డ్ సుచాత చువాంగ్ శ్రీ



థాయిలాండ్ సుందరి ఒపాల్ సుచాత చువాంగ్ శ్రీ మిస్ వరల్డ్ 2025 కిరీటం
హైదరాబాద్‌లో ఘనంగా జరిగిన తుది పోటీలు
భారత్‌లోని అనేక ఆలయాలను సందర్శిస్తానన్న సుచాత

### సింధూ నీళ్లు చుక్క కూడా ఇవ్వం..
## పాక్‌కు భారత్ కౌంటర్



ఢిల్లీ: దాయాది దేశం పాకిస్తాన్‌కు భారత్ ఎప్పటికప్పుడు వరుస షాక్‌లు ఇస్తూనే ఉంది. పహల్గాం ఘటన తర్వాత పాక్‌కు చుక్కలు చూపిస్తోంది. ఇటు దౌత్యపరంగా కూడా పాకిస్తాన్‌ను ముప్పు తిప్పలు పెడుతోంది. తాజాగా సింధూ జలాల విషయంలో మరోసారి పాక్‌కు భారత్ ఝలక్ ఇచ్చింది. పాక్ ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదం అనేది సింధూ

### సోషల్ మీడియాలో మల్లారెడ్డి ఏఐ వీడియో హల్‌చల్!
మాజీ మంత్రి మల్లారెడ్డికి చెందిన ఏఐ వీడియో వైరల్



దివంగత ప్రముఖులతో మాట్లాడినట్లు రూపకల్పన

చాణక్యుడు, గాంధీ, కలాం వంటి వారితో సంభాషణల చిత్రీకరణ

విద్యాసంస్థల స్థాపన, యువతకు విజ్ఞానంపై వీడియోలో ప్రస్తావన

దేశంలోనే అతిపెద్ద విశ్వవిద్యాలయం నిర్మిస్తానని మల్లారెడ్డి మాట

### ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం.. సిట్ విచారణకు సిద్ధమైన ప్రభాకర్‌రావు



- ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడిగా ప్రభాకర్‌రావు
- 5న సిట్ విచారణకు హాజరయ్యే అవకాశం
- 14 నెలలుగా అమెరికాలో ఉంటున్న మాజీ ఐపీఎస్ అధికారి
- సుప్రీంకోర్టు ఆదేశాలతో భారత్‌కు తిరుగు ప్రయాణం
- విచారణకు సహకరిస్తానని కోర్టుకు అండర్‌టేకింగ్

# మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సుదీర్ఘ భేటీ

- యువ వికాసం అర్హుల లెక్క తేలాకే..
- నేటి మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం వాయిదా
- పథకంపై కేబినెట్‌లో చర్చించాక నిర్ణయం
- ఈ నెల 5న సమావేశం కానున్న రాష్ట్ర మంత్రివర్గం
- రాజీవ్ యువ వికాసంతో పాటు వివిధ పథకాలపై చర్చించే అవకాశం
- నేడు రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలని నిర్ణయం



హైదరాబాద్: రాజీవ్ యువ వికాసం మంజూరు పత్రాల జారీ వాయిదా పడింది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం తొలి రెండు కేటగిరీల వారికి యూనిట్లకు సంబంధించిన మంజూరు పత్రాలు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే అర్హులందరికీ మంజూరు పత్రాలు ఇచ్చేందుకు కొంత సమయం పడుతుంది కాబట్టి ఈ అంశంపై మంత్రివర్గ సమావేశంలో చర్చించాలని నిర్ణయించారు. ఈ నెల 5న రాష్ట్ర కేబినెట్ భేటీ కానుంది. ఇందులో రాజీవ్ యువ వికాసంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, ఇతర కీలక అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఆదివారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో రాష్ట్ర మంత్రులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. దాదాపు రెండున్నర గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో మిగతా 2లో..

### మిస్ ఇంగ్లండ్ ఆరోపణలతో రాష్ట్రానికి చెడ్డపేరొచ్చింది: హరీశ్ రావు



సిద్దిపేట జిల్లా తీగుల్‌లో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించిన హరీశ్‌రావు

అందాల పోటీలకు రూ.200 కోట్లు ఖర్చు చేశారంటూ ప్రభుత్వంపై విమర్శ

తెలంగాణ తల్లి విగ్రహం మార్పుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన హరీశ్

కేసీఆర్ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు ఆపేస్తారా అని ప్రశ్న

### వరుసగా రెండో నెల కూడా
## రూ.2 లక్షల కోట్లకు పైగా జీఎస్టీ

- మే నెలలో రూ.2.01 లక్షల కోట్ల జీఎస్టీ వసూలు
- గతేడాది మేతో పోలిస్తే 16.4 శాతం వృద్ధి
- నికర జీఎస్టీ ఆదాయంలోనూ 20 శాతానికి పైగా పెరుగుదల
- దేశీయ వసూళ్లలో 13%, దిగుమతులపై 25.7% వృద్ధి
- 2024 ఆర్థిక సంవత్సరంలో 6.5% వృద్ధిరేటు సాధించిన భారత్




ఢిల్లీ: దేశ వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు మరోసారి ఉత్సాహాన్నిచ్చాయి. మే నెలలో జీఎస్టీ ద్వారా ప్రభుత్వానికి రూ.2.01 లక్షల కోట్ల ఆదాయం సమకూరింది. గతేడాది ఇదే నెలలో వసూలైన రూ.1.72 లక్షల కోట్లతో పోలిస్తే ఇది 16.4 శాతం అధికం కావడం గమనార్హం. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నేడు అధికారిక గణాంకాలను విడుదల చేసింది. దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉందని, వినియోగ వృద్ధి స్థిరంగా కొనసాగుతోందని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. జీఎస్టీ వసూళ్లు రూ.2 లక్షల కోట్ల మార్కును దాటడం మిగతా 2లో..

# శర్మిష్ఠ కోసం పవన్...
## మమతా బెనర్జీ సర్కార్ పై తీవ్ర విమర్శలు!

**అమరావతి,:** ఆపరేషన్ సిందూర్ పై మతతత్వ ఆరోపణలు చేసిన సోషల్ మీడియా పోస్ట్ పై కోల్ కతా పోలీసులు సీరియస్ గా రియాక్ట్ అయిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... న్యాయ విద్యార్థిని శర్మిష్ఠ పనోలిని అరెస్ట్ చేశారు. దీంతో.. ఈ విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై తాజాగా బీజేపీ మిత్రపక్షం జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. మతపరమైన పోస్ట్ పై శర్మిష్ఠ పనోలిని అరెస్ట్ చేయడానికి కోల్ కతా పోలీసులు తీసుకున్న చర్య రాజకీయంగా పెను దుమారాన్ని రేపింది! ఈ వ్యవహారంపై తాజాగా స్పందించిన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. లౌకికవాదం రెండు వైపులా ఉండాలని నొక్కి చెప్పారు. పహల్గాం ఉగ్రదాడిని ప్రతీకారంగా భారత్ సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో మాట్లాడనందుకు బాలీవుడ్ నటులను లక్ష్యంగా చేసుకుని దుర్భాషలాడుతూ, మతతత్వ పదజాలాన్ని ఉపయోగించారనే ఆరోపణలపై 22 ఏళ్ల న్యాయ




విద్యార్థిని శర్మిష్ఠ పనోలిని కోల్ కతా పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆమెపై మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టేలా ఉద్దేశ్యపూర్వకంగా పోస్టులు పెట్టడం, శాంతికి విఘాతం కలిగించే పనులకు పూనుకోవడం వంటి వాటితో సంబంధం ఉన్న బీఎన్ఎస్ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు! అనంతరం ఆమెను కోర్టులో హాజరుపరిచి మిగతా 2లో..

## కల్వకుంట్ల కలహాలు
# ప్రజలకు అవసరమా?

తెలంగాణలో కొన్ని రోజులుగా కేసీఆర్ కుటుంబ వ్యవహారంపై చర్చ

### కవిత అంశంపై స్పందించడానికి నిరాకరించిన కేటీఆర్

హైదరాబాద్(ప్రభాత సూర్య): తెలంగాణలో కొన్ని రోజులుగా ఒకే ఒక్క అంశంపై తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ చర్చంతా ప్రజల కోసం, ప్రజల మధ్య, ప్రజా బాగుకోసం జరుగుతున్నది కాదు. ఒక కుటుంబం అంతర్గత వ్యవహారంలో తలదూర్చడం. ముఖ్యంగా చెప్పాలంటే...ప్రజా సమస్యల మీద వార్త ఛానల్లు, పేపర్లు అంతా కూడా ఆ కుటుంబ సమస్యను ప్రజా సమస్యగా మార్చి ప్రజలపై రుద్దే ప్రయత్నం చేస్తున్నాయి. దీనిపై ప్రజల్లో కూడా అసహనం వ్యక్తం అవుతోంది. బీఆర్ఎస్ తెలంగాణలో మొన్నీమధ్యే రజతోత్సవ వేడుకలు




జరుపుకుంది. 25ఏళ్ల పాటు అవిరామంగా ఉద్యమ పార్టీగా, రాజకీయ పార్టీగా తన పాత్ర పోషించింది. కేసీఆర్ అధినేతగా ఆపార్టీని నడిపించారు. కేసీఆర్ తర్వాతి స్థానంలో కేటీఆర్ ఉన్నారు. పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడిగా ఆయన బాధ్యతలు నిర్వరిస్తున్నారు. ఈక్రమంలో పార్టీలో ఉన్న మరో ఇద్దరు కీలక నేతలు, కేసీఆర్ కుటుంబ మిగతా 2లో..

### తిరుమల ఆలయం మీదుగా తక్కువ ఎత్తులో వెళ్లిన విమానం...



తిరుమల శ్రీవారి ఆలయంపై ఆదివారం ఉదయం విమానం ప్రయాణం

చాలా తక్కువ ఎత్తులో వెళ్లడంపై భక్తుల ఆందోళన, వీడియో రికార్డింగ్

ఆగమశాస్త్ర నిబంధనలకు విరుద్ధమంటూ టీటీడీ ఆవేదన

'నో ఫ్లై జోన్'గా ప్రకటించాలన్న విజ్ఞప్తిని పట్టించుకోని కేంద్రం

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చొరవ చూపాలని భక్తుల డిమాండ్

### జగన్, లోకేశ్ మధ్య వాదనలు దెయ్యాలు వేదాలు వల్లించినట్టే ఉంది: షర్మిల




పదో తరగతి రీకౌంటింగ్‌పై జగన్, లోకేశ్ వాదనలు హాస్యాస్పదమన్న షర్మిల

వైసీపీ హయాంలో రీకౌంటింగ్‌లో 20% మందికి అదనపు మార్కులు

కూటమి ప్రభుత్వంలో 30 వేల దరఖాస్తులకు 11 వేల మందికి ఫస్ట్ క్లాస్

ఇది ప్రభుత్వాల వైఫల్యమేనన్న ఏపీ కాంగ్రెస్ చీఫ్

అన్ని పేపర్లు ఉచితంగా రీవెరిఫికేషన్ చేయాలని డిమాండ్

**అమరావతి,:** పదో తరగతి పరీక్ష ఫలితాల రీకౌంటింగ్ విషయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్, ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మధ్య జరుగుతున్న వాదనలు మిగతా 2లో..

## అయోధ్య రామమందిరాన్ని దర్శించనున్న
# నూతన మిస్ వరల్డ్ సుచాత చువాంగ్ శ్రీ

న్యూఢిల్లీ: హైదరాబాద్ వేదికగా శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగిన మిస్ వరల్డ్ 2025 పోటీల్లో థాయిలాండ్‌కు చెందిన ఒపాల్ సుచాత చువాంగ్ శ్రీ విజేతగా నిలిచి, కిరీటాన్ని కైవసం చేసుకున్నారు. ఈ భారీ విజయం అనంతరం ఆమె ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో మాట్లాడుతూ, భారతదేశంలోని అనేక ఆలయాలను సందర్శించాలని ఉందని, ముఖ్యంగా అయోధ్యలోని రామ మందిరం తన జాబితాలో ఉందని వెల్లడించారు. భారత్, థాయిలాండ్ మధ్య గల సాంస్కృతిక సంబంధాల గురించి ప్రస్తావిస్తూ, ఒపాల్ సుచాత తన ఆసక్తిని పంచుకున్నారు. "భారతదేశంలోని అనేక ఆలయాలను సందర్శించాలని నేను ఎంతగానో కోరుకుంటున్నాను. అవి చాలా ఆకర్షణీయంగా ఉంటాయని నేను భావిస్తున్నాను. నేను చెప్పినట్లుగా, భారత్ మరియు థాయిలాండ్ మధ్య ఎన్నో సంస్కృతులు, సంప్రదాయాలు ఉన్నాయి. కాబట్టి ఆ ప్రదేశాలను సందర్శించడం, వాటి గురించి తెలుసుకోవడం చాలా బాగుంటుంది" అని ఆమె తెలిపారు. భారత్, థాయిలాండ్ దేశాలు సుదీర్ఘకాలంగా సాంస్కృతిక, వాణిజ్య సంబంధాలను పంచుకుంటున్నాయి. థాయిలాండ్‌లో 'రామాయణం'ను 'రామకియెన్'గా పిలుస్తారు. ఈ భారతీయ ఇతిహాసం థాయ్ సాహిత్యం, కళలు మరియు రాచరిక సంప్రదాయాలను గాఢంగా ప్రభావితం చేసింది. ఈ కథనం అసలు భారతీయ రామాయణం ఆధారంగా ఉన్నప్పటికీ, దానికి భిన్నమైన స్థానిక వ్యాఖ్యానాలు, సాంస్కృతిక ఛాయలతో ఒక విలక్షణమైన థాయ్ రూపంలోకి మార్చబడింది. థాయ్ రూపంలో హనుమంతుడికి మరింత ప్రముఖ పాత్ర ఇవ్వబడింది, కొన్నిసార్లు ఆయన పాత్ర మరింత సరదాగా చిత్రీకరించబడుతుంది. మిస్ వరల్డ్ 2025 గ్రాండ్ ఫినాలేకు ఆతిథ్యమిచ్చిన తెలంగాణ రాష్ట్ర మహిళలకు కూడా ఒపాల్ సుచాత తన సందేశాన్ని అందించారు. "ముందుగా, తెలంగాణ, భారతదేశంలోని మహిళలందరినీ కలవడం నాకు ఎంతో ఆనందాన్నిచ్చింది. మీ అందరి బలం, దృఢత్వం మరియు మీ అందరిలోని అంతర్గత సౌందర్యంతో ఈ ప్రయాణంలో మీరందరూ నన్ను నిజంగా ప్రేరేపించారు. భారతదేశంలోని మహిళలందరి నుండి నేను పొందిన మద్దతు, ఆప్యాయత మరువలేనివి. వారు చాలా శక్తివంతులు మరియు జీవితంలో వారు చేయాలనుకున్న అన్ని పనులను సాధించగల సామర్థ్యం కలవారు అని నేను భావిస్తున్నాను" అని ఆమె పేర్కొన్నారు.

## సింధూ నీళ్లు చుక్క కూడా ఇవ్వం..
# పాక్‌కు భారత్ కౌంటర్

మొదటి పేజీ తరువాయి

ఇటు దౌత్యపరంగా కూడా పాకిస్తాన్‌ను ముప్పు తిప్పలు పెడుతోంది. తాజాగా సింధూ జలాల విషయంలో మరోసారి పాక్‌కు భారత్ ఝలక్ ఇచ్చింది. పాక్ ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదం అనేది సింధూ నదీ జలాల ఒప్పందం అమలులో జోక్యంతో సమానమని భారత్ స్పష్టం చేసింది. ఈ ఒప్పందం అమలు విషయంలో తమ దేశాన్ని నిందించడం మానేయాలని పాక్‌కు హితవు పలికింది. కాగా, తజికిస్తాన్‌లోని దుషాన్‌బే నగరం వేదికగా హిమానీ నదాలపై ఐక్యరాజ్యసమితి తొలి సదస్సు ప్లీనరీ సెషన్ జరిగింది. ఈ కార్యక్రమంలో భారత్, పాకిస్తాన్‌కు సహా పలు దేశాలు పాల్గొన్నాయి. ఈ సదస్సులో పాకిస్తాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ మాట్లాడుతూ..'సింధూ నదీ జలాల ఒప్పందాన్ని భారత్ నిలుపుదల చేయడాన్ని మేం అంగీకరించం. సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసమే భారత్ ఇదంతా చేస్తోంది. దీనివల్ల లక్షలాది మంది ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయి. భారతదేశం రెడ్ లైన్‌ను దాటడాన్ని మేం సహించం' అంటూ వ్యాఖ్యలు చేశారు. అనంతరం, పాకిస్తాన్‌కు భారత పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ స్ట్రాంగ్ కౌంటరిచ్చారు. ఈ సందర్భంగా కీర్తి వర్ధన్ ప్రసంగిస్తూ.. సింధూ నదీ జలాల ఒప్పందంపై భారత్, పాక్ సంతకం చేసిన తర్వాత పరిస్థితుల్లో చాలా మార్పులు వచ్చాయి. పాకిస్తానే ఉగ్రవాద కార్యకలాపాల ద్వారా సింధూ నదీ జలాల ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోంది. తానే తప్పు చేస్తూ భారత్‌ను పాక్ నిందించడం సరికాదు. ఈ సదస్సు వేదికను దుర్వినియోగం చేయడానికి, దీని పరిధిలోకి రాని అంశాలను ప్రస్తావించడానికి పాకిస్తాన్ చేసిన ప్రయత్నాన్ని ఖండిస్తున్నాను. సింధూ నదీ ఒప్పందపు నియమ నిబంధనలను పునఃసమీక్షించాల్సిన అవసరం ఉంది. సాంకేతిక, జనాభా, పర్యావరణపరమైన అంశాల్లో మార్పులు జరగాలని డిమాండ్ చేస్తున్నాను. పాక్ సీమాంతర ఉగ్రవాదంపైనా చర్చ జరగాలన్నారు. సద్భావన, స్నేహ స్ఫూర్తితో కుదిరిన ఈ ఒప్పందం అమలుకు ఉగ్రవాదంతో పాకిస్తాన్ ఆటంకం కలిగిస్తోంది. హిమాలయ ప్రాంతంలోని హిమానీనదాల పరిరక్షణకు భారత్ కట్టుబడి ఉంది. హిమానీనదాలు కరిగిపోతుండటం అనేది ఒక హెచ్చరిక మాత్రమే కాదు. ఈ వైపరీత్యం వల్ల జల భద్రత, జీవవైవిధ్యం, వందల కోట్ల ప్రజల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారుతాయి. పర్యావరణ పరిరక్షణతో భూతాపాన్ని తగ్గించడంపై కుదిరిన పారిస్ ఒప్పందంలో భారత్ అంగీకరించిన నేషనల్లీ డిటర్మైండ్ కంట్రిబ్యూషన్స్ (%చీణజం%)ను సాధించే దిశగా మోదీ సర్కారు గణనీయమైన పురోగతిని సాధించామం' అని వెల్లడించారు.

## సోషల్ మీడియాలో మల్లారెడ్డి ఏఐ వీడియో హల్‌చల్!
### మాజీ మంత్రి మల్లారెడ్డికి చెందిన ఏఐ వీడియో వైరల్

**హైదరాబాద్, :** తెలంగాణ రాజకీయాల్లో తనదైన శైలితో తరచూ వార్తల్లో నిలిచే మాజీ మంత్రి మల్లారెడ్డి మరోమారు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. ఈసారి ఆయన దివంగత జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులతో సంభాషిస్తున్నట్లుగా రూపొందించిన ఒక కృత్రిమ మేధ (ఏఐ) వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే, మాజీ మంత్రి మల్లారెడ్డికి సంబంధించిన ఒక ఏఐ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై విస్తృతంగా షేర్ అవుతోంది. ఈ వీడియోలో మల్లారెడ్డి టైమ్ మిషన్ ద్వారా ప్రయాణించి, చరిత్రలో నిలిచిపోయిన పలువురు దిగ్గజాలతో ముచ్చటిస్తున్నట్లుగా చిత్రీకరించారు. వీరిలో ఆచార్య చాణక్యుడు, గౌతమ బుద్ధుడు, మదర్ థెరిసా, స్వామి వివేకానంద, జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వంటి ప్రముఖులు ఉన్నట్లు వీడియోలో చూపించారు. ఈ ఏఐ వీడియోలోని సంభాషణల ప్రకారం, సదరు దివంగత ప్రముఖులు మల్లారెడ్డిని ఉద్దేశించి, "తిరుగులేని భవిష్యత్తునిచ్చే కోర్సులతో అద్భుతమైన విద్యాసంస్థలను స్థాపించు మల్లారెడ్డి, తథాస్తు. విజ్ఞానం పంచే విద్యా సంస్థలను స్థాపించు. రాజ్యాన్ని నిర్మించే విద్యావంతుల్ని తయారు చేయి. యువతని మేల్కొలిపి వారిలో విజ్ఞానం వెలిగించు. అద్భుతమైన టెక్నాలజీతో, కోర్సులతో రేపటి సమాజాన్ని నిర్మించు" అంటూ ప్రోత్సహించినట్లుగా ఉంది. దీనికి ప్రతిస్పందనగా, "మీ అందరి ఆశయాలను నిలబెడతాను. దేశంలోనే అతి పెద్ద విశ్వవిద్యాలయం నెలకొలుపుతాను. ఇది మల్లారెడ్డి మాట" అని ఆయన అన్నట్లుగా వీడియోలో పొందుపరిచారు. సాధారణంగానే తన వ్యాఖ్యలు, చేష్టలతో వార్తల్లో వ్యక్తిగా నిలిచే మల్లారెడ్డి, ఈసారి ఏఐ సాంకేతికతను వాడుకుని రూపొందించిన ఈ వీడియోతో మరోసారి విస్తృతంగా చర్చనీయాంశమయ్యారు. సాంకేతికత సాయంతో సృష్టించిన ఈ వీడియో, నెటిజన్ల నుంచి భిన్నమైన స్పందనలను అందుకుంటోంది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం..
## సిట్ విచారణకు సిద్ధమైన ప్రభాకర్‌రావు

**హైదరాబాద్, :** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న విశ్రాంత ఐపీఎస్ అధికారి టి.ప్రభాకర్‌రావు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణకు హాజరుకానున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఆయన ఈ నెల 5న సిట్ అధికారుల ముందు హాజరయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. 14 నెలలుగా అమెరికాలో ఉంటున్న ప్రభాకర్‌రావు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు భారత్‌కు తిరిగి రానున్నారు. విచారణకు పూర్తిగా సహకరిస్తానని సర్వోన్నత న్యాయస్థానానికి ఆయన ఒక హామీపత్రం కూడా సమర్పించినట్లు సమాచారం. వన్ టైమ్ ఎంట్రీ పాస్‌పోర్టు జారీ అయిన వెంటనే ఆయన భారత్‌కు బయలుదేరనున్నారు. పాస్‌పోర్టు అందిన మూడు రోజుల్లోగా దేశానికి తిరిగి రావాలని సుప్రీంకోర్టు ఇటీవలే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రభాకర్‌రావు సిట్ విచారణకు హాజరవుతున్నట్లు దర్యాప్తు బృందానికి తెలియజేశారని తెలుస్తోంది. ప్రభాకర్‌రావును విచారిస్తే ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన అనేక కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని, తద్వారా కేసు దర్యాప్తు ఒక కొలిక్కి వస్తుందని సిట్ అధికారులు గట్టి నమ్మకంతో ఉన్నారు. ఆయన విచారణ ఈ కేసులో అత్యంత కీలకంగా మారనుందని భావిస్తున్నారు.

## మిస్ ఇంగ్లండ్ ఆరోపణలతో
## రాష్ట్రానికి చెడ్డపేరొచ్చింది: హరీశ్ రావు

**హైదరాబాద్, :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపడుతున్న కార్యక్రమాలపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన తెలుగుతల్లి విగ్రహాన్ని కూడా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ప్రసంగించిన హరీశ్‌రావు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ సర్కార్‌పై విమర్శల వర్షం కురిపించారు.

అందాల పోటీలతో రాష్ట్రానికి చెడ్డపేరు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన అందాల పోటీలపై హరీశ్‌రావు మండిపడ్డారు. "అందాల పోటీల కోసం ఏకంగా రూ.200 కోట్లు ఖర్చు చేశారు. ఈ పోటీల్లో పాల్గొన్న మిస్ ఇంగ్లండ్, ఒకరు తనతో అనుచితంగా ప్రవర్తించారని ఆరోపించడం చూశాం. కేవలం విందులు, వినోదాల కోసమే ఈ పోటీలు నిర్వహించారు తప్ప, దీనివల్ల రాష్ట్రానికి చెడ్డపేరు రావడం మినహా మరే ప్రయోజనం లేదు" అని ఆయన అన్నారు. మూసీ ప్రక్షాళన, 'హైడ్రా' వంటి ముఖ్యమైన ప్రాజెక్టులను ప్రభుత్వం గాలికొదిలేసిందని దుయ్యబట్టారు.

తెలంగాణ తల్లి విగ్రహం మార్పుపై ఆగ్రహం

ఉద్యమ సమయంలో ఎంతో స్ఫూర్తినిచ్చిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడంపై హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇదేనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెస్తానన్న మార్పు? తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలిచిన తల్లి విగ్రహాన్ని మార్చాల్సిన అవసరం ఏమొచ్చింది?" అని ప్రశ్నించారు. రాజీవ్ యువశక్తి పేరుతో కేవలం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే లబ్ధి చేకూర్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.

కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తారా?

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తుత ప్రభుత్వం నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. "కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామంటున్నారు. ఆయన ప్రవేశపెట్టిన రైతు బంధు, కల్యాణ లక్ష్మి వంటి పథకాలను రద్దు చేస్తారా? ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశారు, వాటిని తీసేస్తారా? అద్భుతమైన సచివాలయాన్ని నిర్మించారు, దాన్ని కూల్చేస్తారా? హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే, దాన్ని కూడా తొలగిస్తారా?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రజలకు ఇచ్చిన హామీల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని హరీశ్‌రావు విమర్శించారు. "దేవుడి మీద ఒట్టేసి మరీ మాట తప్పిన వ్యక్తి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి" అని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.




# కల్వకుంట్ల కలహాలు ప్రజలకు అవసరమా?

మొదటి పేజీ తరువాయి

ఈక్రమంలో పార్టీలో ఉన్న మరో ఇద్దరు కీలక నేతలు, కేసీఆర్ కుటుంబ సభ్యులు కూడా పార్టీలో కీలకంగా ఉన్నారు. ఐతే కవిత ఈ మధ్య పార్టీలో రేపిన రచ్చపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ మొదలైంది. నిజానికి ఆమెకు పార్టీలో ఎటువంటి పదవులు లేవు. కానీ ఆమె కేసీఆర్ తనయగా...కొనసాగుతున్నారు. కానీ ఆమె కేసీఆర్ కు రజతోత్సవ వేడుకల తర్వాత లేఖ రాయడం సంచలనం. ఆ తర్వాత కవిత చేసిన కామెంట్లు మరింత హాట్ టాపిక్ అయ్యాయి. కవిత ఆ పార్టీ అధినేత, తన తండ్రి కేసీఆర్ కు లేఖ రాయడం, ఆ పార్టీ అంతర్గత వ్యవహారం. కవిత స్వయంగా చెప్పిన విషయం ఏంటంటే...తాను అనేక సార్లు లేఖలు రాశానని చెప్పడం. కానీ ఈ సారి లేఖ లీక్ అవడం సంచలనంగా మారింది. కానీ దీనిపైనే ప్రధానంగా ఎందుకు చర్చ జరుగుతోందని ప్రజల్లో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాష్ట్రంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. ప్రభుత్వం ప్రజల పట్ల తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ ప్రశ్నించాలి. ఆ పని చేస్తోంది కూడా. కానీ ఆ కుటుంబ వ్యవహారాన్ని ప్రజలపై రుద్దడం ఎంత వరకు సబబు అంటున్నారు. ఫోర్త్ పిల్లర్ గా చెప్పుకునే జర్నలిస్టులు కూడా ఎందుకు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని చర్చ జరుగుతుంది. తెలంగాణను పదేళ్లు కేసీఆర్ పాలించారు. ఆయన పాలన వద్దని...తిరస్కరించారు. అందుకు అనేక కారణాలు ఉన్నాయి. కానీ ఇప్పుడు అప్రస్తుతం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. పాలన సాగిస్తోంది. ప్రజలకు ఇచ్చిన హామీలు ఎంత వరకు నెరవేరాయో? ఎంత వరకు లబ్దిపొందుతున్నారో అందరికీ తెలిసిన విషయమే. ఇవన్నీ పక్కన పెట్టి...ఒక్క కేసీఆర్ కుటుంబంపైనే పొద్దను లేచిన నుంచి పడుకునే వరకు వార్తలు ప్రసారం చేస్తూ...జనాలకు విసుగు తెప్పిస్తున్నారు. వార్తలు ప్రసారం చేయడం తప్పుకాదు...కేసీఆర్ కుటుంబ వ్యవహారం ప్రజా జీవితం కాబట్టి వార్త అవడం సాధారమే...కానీ ఎంత మేరకు చేయాలో అంత వరకే ఇవ్వాల్సిన ప్రాధాన్యత కంటే ఎక్కువ ఇస్తున్నారని అంటున్నారు. మరోవైపు మీడియా అటెన్షన్ కోసం కూడా ఆ పార్టీలో కొందరు దీన్ని హైలెట్ చేస్తున్నారని అంటున్నారు. ఐతే కవిత అంశంపై స్వయంగా కేసీఆర్ మాట్లాడేందుకు నిరాకరిస్తుంటే...పని గట్టుకుని వార్తలు ప్రసారం చేయడం దేనికని ప్రజానికం ప్రశ్నిస్తున్నారు. అలాగే కవిత కూడా వార్తల్లో ఉండేందుకు ఈ ప్రయత్నాలు చేస్తుందా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాలకు ఎంత ప్రాధాన్యత ఇవ్వాలో అంతే ఇచ్చి ప్రజల సమస్యలపై ఎక్కువ ఫోకస్ చేయాలని ప్రజా నికం కొరుతున్నారు.

# మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సుదీర్ఘ భేటీ

మొదటి పేజీ తరువాయి



ఈ సమావేశంలో ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ సదస్సులు, రాజీవ్ యువ వికాసం, వానాకాలం పంటల సాగు సన్నద్ధత, ఉద్యోగుల సమస్యలు, క్షేత్రస్థాయిలో పరిస్థితులు, జిల్లాల్లో మంత్రులు చేసిన పరిశీలన, రాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహణ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

యువ వికాసానికి అనూహ్య స్పందన

రాజీవ్ యువ వికాసం పథకానికి ఊహించిన దానికంటే ఎక్కువ స్పందన వచ్చింది. ఈ నేపథ్యంలో..మొత్తం నాలుగు కేటగిరీలకు సంబంధించి ప్రభుత్వానికి అందిన ప్రతి దరఖాస్తును పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాతే అర్హుల ఎంపిక జరపాలని, ఈ పథకం కింద అనర్హులకు ఎట్టి పరిస్థితుల్లో చోటు దక్కకుండా, అర్హులందరికీ లబ్ధి చేకూరేలా చూడాలని మంత్రులు సూచించారు. క్షేత్రస్థాయిలో కూడా ఈ పథకం కింద వచ్చిన దరఖాస్తుల విషయంలో ఫిర్యాదులు వస్తున్నాయని, కాబట్టి అత్యంత పారదర్శకంగా పరిశీలన జరపాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ నేపథ్యంలోనే దరఖాస్తుల పరిశీలన పూర్తయ్యాకే అర్హుల జాబితాలను ప్రకటించాలని నిర్ణయించారు. సోమవారం తెలంగాణ ఆవిర్భావ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని, ఇందుకు జిల్లాల్లో ఏర్పాట్లు పక్కాగా ఉండేలా చూడాలని మంత్రులకు సీఎం సూచించారు.

క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని అప్రమత్తం చేయండి: సీఎం

రాష్ట్రంలో ధాన్యం కొనుకోలుకు సంబంధించిన అంశాలపై మంత్రులు క్షేత్రస్థాయి పరిస్థితులను సీఎంకు వివరించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని ఈ సందర్భంగా మంత్రులు అభినందించారు. కాగా ధాన్యం కొనుగోళ్లపై సీఎం జిల్లాల వారీగా సమీక్షించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులతో పాటు ప్రభుత్వం తీసుకోవల్సిన చర్యలపై చర్చించారు. వానాకాలం సీజన్ ప్రారంభం కావడం.. రాష్ట్రానికి ముందస్తు రుతుపవనాలతో కలిగే ప్రయోజనాలు, నష్టాలపైనా చర్చించారు. ఈ సీజన్‌కు సంబంధించి పంటల సాగును వేగవంతం చేయాలని, క్షేత్రస్థాయిలో అధికార యంత్రాగాన్ని ఈ దిశగా అప్రమత్తం చేయాలని రేవంత్ చెప్పారు.

ఆర్థికేతర అంశాలను పరిష్కరిద్దాం!

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ఇప్పటికే ప్రభుత్వం సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేయగా.. ఆ కమిటీ మంత్రివర్గ ఉప సంఘానికి నివేదిక సమర్పించింది. ఈ నివేదికలోని ప్రధాన అంశాలను సీఎం రేవంత్‌రెడ్డికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వివరించారు. ఉద్యోగుల సమస్యల్లో ప్రధానంగా ఆర్థికేతర అంశాలను పరిష్కరిస్తే వారికి కొంతమేర ఊరటగా ఉంటుందని, ఉద్యోగ సంఘాల డిమాండ్ కూడా ఇదేనని భట్టి చెప్పారు. దీంతో ఆర్థికేతర అంశాల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగానే ఉందని, దీనిపై కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుందామని మంత్రులకు సీఎం సూచించినట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం పురోగతిపైనా, గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు, భూభారతి ద్వారా సమస్యల పరిష్కారం తదితర అంశాలపైనా ఈ సమావేశంలో చర్చించారు. రుతుపవనాలతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మంత్రులంతా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు.

# వరుసగా రెండో నెల కూడా రూ.2 లక్షల కోట్లకు పైగా జీఎస్టీ

మొదటి పేజీ తరువాయి

జీఎస్టీ వసూళ్లు రూ.2 లక్షల కోట్ల మార్కును దాటడం ఇది వరుసగా రెండో నెల కావడం విశేషం. ఏప్రిల్ నెలలో జీఎస్టీ వసూళ్లు రూ.2.37 లక్షల కోట్లతో సరికొత్త ఆల్-టైమ్ రికార్డును సృష్టించిన సంగతి తెలిసిందే. మార్చి నెలతో పోలిస్తే అది 13 శాతం పెరుగుదల. ఆర్థిక సంవత్సరం ముగింపు, ఖాతాల సర్దుబాటు వంటి అంశాలు ఏప్రిల్ వసూళ్ల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలిచాయి. అయితే, మే నెలలో కూడా జీఎస్టీ వసూళ్లు బలంగా ఉండటం, ఈ వృద్ధి కేవలం సీజనల్ అంశాలకే పరిమితం కాలేదని స్పష్టం చేస్తోంది. రీఫండ్లను పరిగణనలోకి తీసుకున్న తర్వాత నికర జీఎస్టీ ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. ఇది 20 శాతానికి పైగా వృద్ధితో రూ.1.73 లక్షల కోట్లకు చేరింది. వివరాల్లోకి వెళితే, దేశీయ లావాదేవీల ద్వారా వసూలైన జీఎస్టీ 13 శాతం పెరగ్గా, దిగుమతుల ద్వారా వచ్చిన ఆదాయం ఏకంగా 25.7 శాతం పెరిగింది. మరోవైపు, భారత ఆర్థిక వ్యవస్థ కూడా స్థిరమైన వృద్ధి సంకేతాలను చూపుతోంది. మే 30న విడుదలైన గణాంకాల ప్రకారం, 2024 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న 6.5 శాతం వృద్ధి లక్ష్యాన్ని దేశం సాధించింది. జనవరి నుంచి మార్చి త్రైమాసికంలో ఆర్థిక వ్యవస్థ 7.4 శాతం వృద్ధి చెంది, అంతకుముందున్న మందగమనం నుంచి బలంగా పుంజుకుంది. వృద్ధికి కీలకమైన వినియోగం కూడా ఏడాది కాలంలో మెరుగుపడింది. క్రితం ఆర్థిక సంవత్సరంలో 5.6 శాతం వృద్ధి చెందిన వినియోగం మళ్లీ పుంజుకుంది. ఏప్రిల్ నెలలో గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్ వంటి కన్స్యూమర్ డ్యూరబుల్ గూడ్స్ ఉత్పత్తి 6.4 శాతం వృద్ధి చెందింది. మార్చిలో ఇది 6.9 శాతంగా నమోదైంది. గత నెల (ఏప్రిల్)లో జీఎస్టీ వసూళు రికార్డు స్థాయిలో రూ.2.37 లక్షల కోట్లకు చేరాయి. అంతకు ముందు సంవత్సరం ఏప్రిల్‌లో రూ.2.10 లక్షల కోట్లుగా ఉన్న వసూళ్లతో పోలిస్తే ఇది 12.6 శాతం ఎక్కువ. పెరిగిన ఆర్థిక కార్యకలాపాలు, మెరుగైన పన్ను చెల్లింపుల నిబద్ధత వల్లే ఏప్రిల్ నెలలో జీఎస్టీ వసూళ్లు పెరిగాయని ఒక సీనియర్ అధికారి అప్పట్లో తెలిపారు.

## శర్మిష్ఠ కోసం పవన్...
## మమతా బెనర్జీ సర్కార్ పై తీవ్ర విమర్శలు!

మొదటి పేజీ తరువాయి




అనంతరం ఆమెను కోర్టులో హాజరుపరిచి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఈ సందర్భంగా స్పందించిన పవన్... ఆపరేషన్ సిందూర్ సమయంలో, న్యాయ విద్యార్థిని శర్మిష్ఠ తన మాటలతో తీవ్రంగా స్పందించింది, ఆమె మాటలు కొంతమందికి బాధ కలిగించాయి. అయితే.. ఆమె తన తప్పును అంగీకరించి, వీడియోను తొలగించి క్షమాపణలు చెప్పింది. ఇదే సమయంలో.. ఆమెపై పశ్చిమ బెంగాల్ పోలీసులు వేగంగా చర్య తీసుకున్నారు అని అన్నారు. అనంతరం... ఎన్నికైన నాయకులు, టీఎంసీ ఎంపీలు సనాతన ధర్మాన్ని అపహాస్యం చేసినప్పుడు, లక్షలాది మందికి లోతైన బాధను కలిగించిన సంగతి ఏమిటి? మన విశ్వాసాన్ని గాంధ ధర్మ అని పిలిచినప్పుడు ఆ అగ్రహం ఎక్కడ ఉంది? వారి క్షమాపణలు ఎక్కడ? వారి అరెస్ట్ ఎక్కడ? అంటూ పవన్ ప్రశ్నించారు. దైవదూషణను ఎల్లప్పుడు ఖండించాలని అన్నారు. ఈ సందర్భంగా... లైకికవాదం అనేది కొంతమందికి కవచం కాదని, ఇదే సమయంలో మరికొంతమందికి కత్తి కాదని.. అది టూ వే స్ట్రీట్ అయి ఉండాలని తెలిపారు. ఈ సమయంలో పశ్చిమ బెంగాల్ పోలీసులవైపు దేశం చూస్తోందని.. అందరికీ సమన్యాయంగా వ్యవహరించాలని అన్నారు.

## తిరుమల ఆలయం మీదుగా తక్కువ ఎత్తులో వెళ్లిన విమానం...

**అమరావతి,:** తిరుమల పుణ్యక్షేత్రంలో మరోసారి అపచారం జరిగిన ఘటన భక్తులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. శ్రీవారి ఆలయ గోపురం మీదుగా ఆదివారం ఉదయం ఓ విమానం అత్యంత సమీపం నుంచి ప్రయాణించడం తీవ్ర కలకలం రేపింది. స్వామివారి ఆలయంపై చాలా తక్కువ ఎత్తులో విమానం వెళ్లడాన్ని పలువురు భక్తులు ప్రత్యక్షంగా చూశారు. ఈ దృశ్యాలను కొందరు తమ మొబైల్ ఫోన్లలో చిత్రీకరించారు. ఈ ఘటనపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు వెంటనే ఈ విషయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) విజిలెన్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న టీటీడీ అధికారులు అప్రమత్తమయ్యారు. ఆలయం మీదుగా ప్రయాణించిన విమానం ఎక్కడి నుంచి వచ్చింది, ఎక్కడికి వెళుతోంది అనే వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఆగమశాస్త్ర నియమాల ప్రకారం, తిరుమల శ్రీవారి ఆలయం మీదుగా విమానాలు గానీ, హెలికాప్టర్లు గానీ ప్రయాణించడం పూర్తిగా నిషిద్ధం. ఇలాంటి ప్రయాణాలను అపచారంగా పరిగణిస్తారు. ఈ నేపథ్యంలోనే తిరుమలను 'నో ఫ్లై జోన్'గా ప్రకటించాలని టీటీడీ చాలాకాలంగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతోంది. అయితే, కేంద్ర పౌరవిమానయాన శాఖ ఈ ప్రతిపాదనను ఆచరణ సాధ్యం కాదని తెలుపుతూ వస్తోంది. దీంతో ఈ విషయంలో టీటీడీ కూడా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయింది. గతంలోనూ అనేకసార్లు శ్రీవారి ఆలయం మీదుగా విమానాలు, హెలికాప్టర్లు వెళ్లిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. గత రెండు, మూడేళ్లుగా ఇటువంటి ఘటనలు పునరావృతమవుతూనే ఉన్నాయి. ప్రతిసారీ భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని, వారి ఆందోళనను పరిగణనలోకి తీసుకోవాలని టీటీడీ వర్గాలు పేర్కొంటున్నాయి. తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతుండటంపై తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రిగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రామ్మోహన్ నాయుడు బాధ్యతలు నిర్వహిస్తుండటం గమనార్హం. అంతేకాకుండా, కేంద్ర ప్రభుత్వంలో తెలుగుదేశం, జనసేన పార్టీలు భాగస్వాములుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో, మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రత్యేక చొరవ తీసుకుని, తిరుమలను 'నో ఫ్లై జోన్'గా ప్రకటించేలా కేంద్రాన్ని ఒప్పించాలని భక్తులు కోరుతున్నారు.

## జగన్, లోకేశ్ మధ్య వాదనలు
## దెయ్యాలు వేదాలు వల్లించినట్టే ఉంది: షర్మిల

మొదటి పేజీ తరువాయి

"దెయ్యాలు వేదాలు వల్లించినట్లు" ఉన్నాయని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శించారు. విద్యావ్యవస్థను గత, ప్రస్తుత ప్రభుత్వాలు భ్రష్టు పట్టించాయని ఆమె ఆరోపించారు. ఈ మేరకు ఆమె ట్వీట్ చేశారు. "వైసీపీ పాలనలో ప్రతి సంవత్సరం రీకౌంటింగ్‌లో ఫెయిల్ అయిన విద్యార్థుల్లో దాదాపు 20 శాతం మంది తిరిగి అధిక మార్కులతో పాస్ అయ్యేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కూడా అదే పరిస్థితి నెలకొంది. రీకౌంటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న 30 వేల మంది విద్యార్థుల్లో ఏకంగా 11 వేల మందికి ఫస్ట్ క్లాస్ మార్కులు రావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. దీన్నిబట్టి పేపర్ల మూల్యాంకనంలో ఎంత చిత్తశుద్ధి ఉందో, ఎంత క్రమశిక్షణతో పేపర్లు దిద్దారో అర్థం చేసుకోవచ్చు. ఫలితాల్లో పారదర్శకత కొరవడిందని స్పష్టమవుతోంది. విద్యావ్యవస్థను పూర్తిగా నాశనం చేశారనడానికి ఇంతకంటే నిదర్శనం మరొకటి అవసరం లేదు" అని షర్మిల విమర్శించారు. గత పదేళ్లుగా రాష్ట్రంలో విద్యార్థులు కాదు, ప్రభుత్వాలే ఫెయిల్ అవుతున్నాయని షర్మిల దుయ్యబట్టారు. "వాస్తవానికి ఫెయిల్ అయ్యింది విద్యార్థులు కాదు. పేపర్లు సరిగ్గా దిద్దలేని వైసీపీ, కూటమి ప్రభుత్వాలే రాష్ట్రంలో గత 10 ఏళ్లుగా ఫెయిల్ అవుతున్నాయి. పిల్లల భవిష్యత్తును నిర్ణయించడంలో విఫలమైన వీళ్లు రాష్ట్రాన్ని ఏం ఉద్ధరిస్తారు? చదువులతో చెలగాటం ఆడుతున్నారు. విద్యార్థుల ప్రాణాలతో ఆటలాడుకుంటున్నారు. ధనదాహం మీద ఉన్న శ్రద్ధ విద్యావ్యవస్థను బాగుచేయడం మీద వీరికి లేదు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "30 వేల మంది విద్యార్థులకు సంబంధించి 60 వేల పేపర్లకు రీకౌంటింగ్ దరఖాస్తులు వస్తే, అందులో 11 వేల మందికి అత్యున్నత మార్కులు రావడం పూర్తిగా మీ ప్రభుత్వ వైఫల్యమే. విద్యాశాఖ మంత్రిగా లోకేష్ గారు విఫలమైనట్లే. దీనిపై తక్షణమే విచారణ జరిపించాలి. పరీక్ష రాసిన ప్రతి విద్యార్థి పేపర్‌ను ఉచితంగా రీవెరిఫికేషన్ చేయాలి" అని షర్మిల డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకునే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదని ఆమె స్పష్టం చేశారు.

# నేటి నుంచి సంక్షేమ పథకాల జోష్
### అవతరణ దినోత్సవం నేపథ్యంలో కొత్త పథకాలు
### రాజీవ్ యువ వికాసానికి ప్రొసీడింగ్స్
### రైతులకు ఫౌండేషన్ సీడ్ పంపిణీ
### గ్రామపాలన అధికారులకు నియామక ఉత్తర్వులు

నల్లగొండ, :రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం కొత్త సంక్షేమ పథకాలను అమలు చేయనుంది. ప్రధానంగా రాజీవ్ యువ వికాస్ పథకాన్ని ప్రభు త్వం ప్రారంభించనుంది. యువత సాధికారత, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడమే లక్ష్యంతో రాజీవ్ యువ వికాస్ పథకాన్ని రూపొందించింది. పథకంలో భాగంగా రూ. లక్షలోపు సబ్సిడీని తొలివిడత అందజేయనున్నారు.ప్రతి నెలా విడతల వారీగా ఈ పథకాన్ని అమలు చేస్తారు. అక్టోబ రు 2 నాటికి లబ్ధిదారులందరికీ అందజేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జూన్ మొదటి వారంలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టు కిం ద చేపట్టిన ఇళ్లను ప్రారంభిస్తారు. పనులు జరుగుతున్న తీరును బట్టి లబ్ధిదారులకు విడతల వారీగా నిధులు మంజూరు చేస్తారు. జూన్ మొదటి వారంలో కొందరూ గృహప్రవేశం చేసేందుకు ఏర్పాట్లు కూ డా జరిగాయి. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కొత్త పథకాలను వేగవంతం చేయాలని నిర్ణయించి ఆయా పథకాలను అమలులోకి తీసుక వస్తున్నారు. రాజీవ్ యువ వికాసతోపాటు గ్రామపాలన అ?ధికారులకు నియామక ఉత్తర్వులు, ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలు, రైతుభరోసా పెండింగ్ నిధులపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించారు. అదేవిధంగా ఉద్యోగులకు డీఏ ప్రకటన చేసే అవకాశాలు కూడా ఉన్నాయి. అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

3నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

రెవెన్యూ సేవలను సరళతరం చేయడం, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించనుంది. ఈనెల 3వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు జరగనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన భూభారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. రెవెన్యూ సదస్సుల వివరాలను ముందుగానే ప్రజలందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహించే సదస్సులకు ఒక రోజు ముందే టాంటాం ద్వారా ప్రచారం చేయనున్నారు. రెవెన్యూ సదస్సులు ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహిస్తారు. ప్రతీ రోజు సాయంత్రం ఆర్డీవో కార్యాలయంలో ఆ రోజు వచ్చిన దరఖాస్తులపై చర్చిస్తారు. దరఖాస్తుల డేటా కోసం ప్రత్యేకంగా డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ప్రతీ మండలంలో రెండు బృందాలుగా ఏర్పడి ఒక బృందానికి తహసీల్దార్, మరో బృందానికి నాయబ్ తహసీల్దార్ నాయకత్వం వహిస్తారు. బృందంలో ఆర్ఐ, సర్వేయర్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉండనున్నారు. దరఖాస్తు స్వీకరించిన తర్వాత దరఖాస్తుదారులకు రసీదు ఇవ్వడంతో పాటు దరఖాస్తులను ఆయా కేటగిరీల వారీగా విభజిస్తారు.

రైతులకు ఫౌండేషన్ సీడ్ పంపిణీ

రెవెన్యూ గ్రామాల్లో ఎంపిక చేసిన ముగ్గురు రైతులకు సోమవారం జరిగే రాష్ట్ర అవతరణ దినోత్సవాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు ఫౌండేషన్ సీడ్ పంపిణీ చేయనున్నారు. అందుకు సంబం?ధించి వ్యవసాయ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. రెవెన్యూ గ్రామాల్లో ముగ్గురు రైతుల చొప్పున ఎంపిక చేశారు. వరికి సంబంధించి రెండు కిట్లు, పెసర్లు ఒక కిట్ పంపిణీ చేస్తారు. నల్లగొండ జిల్లాలో 33 మండలాల్లో 140 క్లస్టర్లను ఎంపిక చేయగా, అందులో 564 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. 564 గ్రామాలకు మొత్తం 1,692 కిట్లను పంపిణీ చేస్తారు. వీటిలో వరి విత్తనాల కిట్స్ 1128 ఉండగా, పెసర్లు 564 కిట్లు ఉన్నాయి. రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేసి విత్తన ఉత్పత్తిని సాధించడం కోసం ఫౌండేషన్ సీడ్‌ను పంపిణీ చేస్తున్నారు. మూడు జిల్లాలకు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా విడుదలైంది. యాదాద్రి జిల్లాలో పంట నష్టపోయిన 1,385 ఎకరాలకు 1,029 మంది రైతులకు రూ.1,38,56,000 పరిహారం చెల్లించనున్నారు. సూర్యాపేట జిల్లాలో 1,104 ఎకరాలకు సంబంధించి 662మంది రైతులకు రూ.1,10,41,750 వారి ఖాతాలో జమ చేయనున్నారు. నల్లగొండ జిల్లాలో 726 ఎకరాలకు సంబంధించి 679మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూ.72.69లక్షలు మంజూరు కాగా, వీటిని ప్రభుత్వం విడుదల చేసింది.

## కాంగ్రెస్ నేతల మధ్య విభేదాలను గుర్తించారా

### -వాటిని చక్కదిద్దేందుకు చర్యలకు ఉపక్రమించారా?


### తెలంగాణలో పార్టీ బలోపేతంపై కాంగ్రెస్ ఫోకస్



ప్రభాత సూర్య- తెలంగాణ డెస్క్ : తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ మీనాక్షి నటరాజన్ సమీక్షలు నిర్వహించారు. వరుసగా జిల్లాల నేతలతో చర్చలు జరుపతున్నారు. పార్టీ బలోపేతంపై సూచనలు చేస్తున్నారు. నేతల మధ్య విభేదాలను గుర్తించారా? వాటిని చక్కదిద్దేందుకు చర్యలకు ఉపక్రమించారా? తెలంగాణలో పార్టీ బలోపేతంపై కాంగ్రెస్ ఫోకస్ పెట్టింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్ దూకుడు పెంచారు. నియోజకవర్గాల వారీగా మీనాక్షి నటరాజన్ పార్టీ సమీక్షలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. వరంగల్, నాగర్‌కర్నూల్, సికింద్రాబాద్ నియోజకవర్గాల వారీగా నాయకులతో ఆమె మీటింగ్ నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో రివ్యూ చేపట్టారు. కార్పోరేషన్ చైర్మన్‌లు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో మీనాక్షి సమావేశం అయ్యారు అధికార పార్టీ నేతల్లో ఉన్న పొరపొచ్చాలు, వారి మధ్య నెలకొన్న సమస్యలను మేడం సరిదిద్దే పనిలో పడ్డారు. తెలంగాణలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయి. ఎన్నికల ముందు వరుస మీటింగ్స్ నిర్వహించడం ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ప్రధానంగా రాష్ట్రం జరిగే ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్ నాయకులకు పలు సూచనలు చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు గ్రామ, పట్టణ ప్రాంతాల్లోని లోకల్‌గా ఉన్న సమస్యలపై ఆరా తీస్తున్నారు. అదేవిధంగా పార్టీలో మంత్రి విస్తరణ, ఇతర పదవుల భర్తీ పై నేతల ఎలిజిబిలిటీ, పర్ఫామెన్స్ గురించి కూడా మీనాక్షి అడిగి తెలుసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పార్టీ క్యాడర్ తో భేటీ అవుతూ వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి ఎలా ఉంది, పార్టీ బలోపేతానికి ఇంకా ఏమేం చేస్తే బాగుంటుంది. రాష్ట్ర సర్కార్ సంక్షేమ పథకాలు ఎలా ఉన్నాయి.. వాటిపై ప్రజల అభిప్రాయాలేంటి అనే వివరాలను సేకరిస్తున్నారు. మరోవైపు ఆయా ప్రాంతాల్లోని నేతల మధ్య నెలకొన్న విభేదాలు ఏమిటి, వాటిని పరిష్కరించేందుకు తీసుకోవాలని చర్యలు ఏంటని సమావేశాల ద్వారా మీనాక్షి నటరాజన్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. తక్కువ కాలంలో ప్రభుత్వంపై వస్తున్న నెగెటివ్ టాక్‌పై కూడా ఆమె ఆరా తీస్తున్నట్లు సమాచారం.

## ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయండి

### ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేత



యాచారం – ప్రభాత సూర్య ( జూన్ 01):. మండల పరిధిలో కేస్లీ తండ, మీసాల తండా గిరిజనులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని హైదరాబాదులో తిరుమల హిల్స్ ఎమ్మెల్యే రంగారెడ్డి నివాసంలో ప్రసన్న ఆంజనేయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు నేనావత్ యాదగిరి, రాజేందర్, నరేందర్, ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందించారు. ఆదివారం ఈ సందర్భంగా.. వడగండ్ల వానకు, రేకుల ఇండ్లు, మిద్దెల ఇండ్లు, కూలిపోయాయి. కేస్లీ తండ, మీసాల తండాలో ఏ ఒక్కరికి ఇంద్రమ్మ ఇండ్లు రాలేదని ఎమ్మెల్యేకు తండావాసులు విన్నవించారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే స్పందించి అర్హులైన వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేస్తుందని చెప్పారు. పేద ప్రజలు ఏ ఒక్కరు అధైర్య పడుద్దని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాందాస్, డాక్టర్ నేనావత్ జ్యోతి జైపాల్ నాయక్, రాములు, బావోజీ, రాజ్ కుమార్, రామ్ జి, గోపాల్ సీతారాం, ఈశ్వర్, విజయ్,జడదీష్, రమేష్, మోతిలాల్, జవహర్ లాల్, రాజు, గోవింద్, వినోద్, రమణా, రాజేష్, రాకేష్, విజయ్, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

### నాభి శిల బొడ్రాయి ద్వితీయ

## వార్షికోత్సవాన్ని జయప్రదం చేయండి

### చైర్మన్ లిక్కి గోవర్ధన్ రెడ్డి



యాచారం -ప్రభాత సూర్య( జూన్ 01):. మండల పరిధిలో చింతపట్ల గ్రామంలో శ్రీ శ్రీ నాభి శిల బొడ్రాయి పండుగ ద్వితీయ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని బొడ్రాయి కమిటీ చైర్మన్ లిక్కి గోవర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. విశ్వనామ సంవత్సరం జేష్ట శుద్ధ సప్తమి సోమవారం ఎనిమిది గంటలకు స్వస్తి వాచకం పంచమృతాలతో ప్రత్యేకంగా హెూమాలు, యజ్ఞాలు నిర్వహిస్తారు. ప్రతి ఒక్కరు హాజరుకావాలని ఆయన కోరారు. ఆదివారం సాయంత్రం గ్రామ పొలిమర్లలో పసుపు కుంకుమలతో నీళ్లు పోసి, గ్రామ దేవతలకు ప్రత్యేకంగా పూజలు చేసి, కొబ్బరికాయలు కొట్టారు. బొడ్రాయి పండుగ సమయంలో గ్రామ ప్రజలకు రక్షణ, సంక్షేమం కోసం ఈ బొడ్రాయి జరుపుకోవాలని ఆశిస్తూ, చింతపట్ల గ్రామానికి పండుగ సందర్భంగా వస్తున్న బంధువు, మిత్రులందరికీ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మా భాషయ్య, సింగారం వెంకటయ్య, ఏనుగుల మధుకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ పత్తి విత్తనాల విక్రేత అరెస్ట్

### 300 కిలోల నిషేధిత విత్తనాలు స్వాధీనం...

### ఎస్ఓటి పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారుల సంయుక్త ఆపరేషన్





షాద్ నగర్ ప్రభాతసూర్య ప్రతినిధి (జూన్ 1): షాద్ నగర్ పరిగి రోడ్డులోని బకర్మన్ గార్డెన్ సమీపంలో నిషేధిత నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తున్న ఒక వ్యక్తిని ఎస్ఓటి పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా ఆదివారం మధ్యాహ్నం పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు అధికారులు తనిఖీలు నిర్వహించగా %ూ 03 దీూ% 5204 నంబరు గల హెూండా మొబిలియో వాహనంలో 300 కిలోల నిషేధిత పత్తి విత్తనాలు లభ్యమయ్యాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా అమరావతి మండలానికి చెందిన వీర వసంతరావు, ఎన్టీఆర్ జిల్లా చంద్రలపాడు గ్రామ నివాసి అయిన జంపాని నాగేశ్వర్ రావుతో కలిసి ఈ నిషేధిత విత్తనాలను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. పరిగి పట్టణంలో నివాసం ఉంటున్న జంపాని నాగేశ్వర్ రావు, వికారాబాద్ మండలం ధ్యాచెర్ల గ్రామంలో పొలం కౌలుకు తీసుకుని, దానిని సాకుగా చూపి పక్క రైతులకు నిషేధిత పత్తి విత్తనాలను విక్రయించేందుకు ప్రయత్నించినట్లు అధికారులు తెలిపారు. షాద్ నగర్ పరిగి రోడ్డులోని బకర్మన్ గార్డెన్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ముగ్గురు రైతులకు ఈ విత్తనాలను విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో షాద్ నగర్ ఇన్‌చార్జ్ ఏడీఏ అగ్రికల్చర్ నిశాంత్ కుమార్, ఫరూక్‌నగర్ వ్యవసాయ విస్తరణ అధికారి తేజ్ కుమార్, ఎస్.ఐ. శరత్, మేడ్చల్ ఎస్ఓటి ఎస్.ఐ. ధనుంజయ పాల్గొన్నారు. రైతులు ఇలాంటి నకిలీ విత్తనాలతో మోసపోవద్దని, జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

# పుట్టగొడుగుల్లా మెడికల్ షాపులు...




- వ్యాపారమే పరమావధిగా అడ్డగోలు పనులు.

ఫార్మాసిస్టులు లేకుండానే మందుల విక్రయం

- గుర్తింపులేని కంపెనీల ట్యాబ్లెట్ల అమ్మకం
- కల్తీ మందులతో నష్టపోతున్న వినియోగదారులు
- లాభాలు ఆర్జిస్తున్న మెడికల్ షాపు యజమానులు
- డ్రగ్స్ కంట్రోల్ అధికారుల పర్యవేక్షణ కరువు
- గల్లీకొక మెడికల్ షాపు తెరుస్తున్న యజమానులు
- ఎలాంటి అనుభవం లేకుండానే షాపుల నిర్వహణ

తుర్కయంజాల్-ప్రభాత సూర్య: : ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని తుర్కయంజాల్‌లో మెడికల్ స్టోర్లు కిరాణా షాపుల్లా వెలుస్తున్నాయి. గల్లీకి రెండు నుంచి మూడు మెడికల్ దుకాణాలు వెలుస్తున్నాయి. స్టోర్స్‌లో ఫార్మాసిస్ట్ లేకుండానే మందులు విక్రయిస్తున్నారు. అంతేకాదు కొత్త కొత్త కంపెనీలు, గుర్తింపు లేని ఫార్మా కంపెనీల పేర్లతో మందులు అమ్మేస్తున్నారు. అధిక ధరలు, గుట్టు చప్పుడు కాకుండా నిషేధిత డ్రగ్స్ విక్రయాలు కొనసాగుతున్నాయి. జ్వరం, జలుబు, తలనొప్పి ఇలా ఏదైనా ప్రజలు నేరుగా మెడికల్ షాపునకు వెళ్ళి మందులు కొనుగోలు చేస్తున్నారు. డాక్టర్ వద్దకు వెళ్లే టైమ్ లేకనో, డబ్బులకు వెనకాడి వెళ్లలేని వారు మెడికల్ షాపులను సంప్రదిస్తున్నారు. దీంతో డాక్టర్ ప్రిస్కిప్షన్, కనీసం ఫార్మాసిస్ట్ లేకుండా మెడికల్ షాపు యజమానులు మందులు అందజేస్తున్నారు. యాంటిబయోటిక్స్‌తోపాటు రెండు, మూడు రకాల ట్యాబ్లెట్లు ఇచ్చి ప్రజల అవసరాలను క్యాష్ చేసుకుంటున్నారు. మందులు వాడినా జబ్బు నయం కాకపోతే అప్పుడు వైద్యులను సంప్రదిస్తున్నారు. నష్టపోవడం వినియోగదారుల వంతు అయితే లాభాలు మెడికల్ షాపుల యజమానులు అర్జిస్తున్నారు. తుర్కయంజాల్ మున్సిపల్ లో వందలకొద్దీ మెడికల్ షాపులు నడుస్తుండగా, అందులో చాలా వరకు నిబంధనలను పాటించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మెడికల్ షాపుల్లో ప్రభుత్వ ఆమోదం పొందిన ఫార్మా కంపెనీల మందులనే విక్రయించాలి. కానీ అందుకు విరుద్ధంగా ఆయా షాపుల యజమానులు వ్యవహరిస్తున్నారు. గుర్తింపులేని ఫార్మా కంపెనీలనుంచి మెడికల్ షాపుల యజమానులకు కమీషన్ ఆశ చూపడంతో వారు కక్కుర్తి పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. చిన్న పిల్లల మెడిసిన్స్ కూడా కల్తీ చేసి విక్రయిస్తున్నారు. వీటి వల్ల రోగం నయం కాకపోవడమే కాదు... దుష్పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇక ధరల విషయానికి వస్తే నిర్దేశించిన వాటికంటే ఎక్కువ ధరకే విక్రయిస్తున్నారు. వినియోగదారుడికి అమ్మే మెడిసిన్ లో దుకాణాదారుడికి కొంత మేర కమీషన్ ఉంటుంది. ఆ కమీషన్ తీసుకుంటూనే కస్టమర్ల నుంచి అధికంగా వసూలు చేసి మరింత ఎక్కువ రేటుకు అమ్మేస్తున్నారు. దీంతో రెండు విధాలుగా ధనార్జన సాగుతోంది. ఇక డాక్టర్ ప్రిస్ప్రిప్షన్ లేనిదే కొన్ని మందులు విక్రయించకూడదు. కానీ వాటిని కూడా మెడికల్ షాపుల్లో పని చేసే వారు, వాటి యజమానులు తామే డాక్టర్లుగా రోగానికి మందులు ఇస్తున్నారు. వీటిపై అవగహన ఉన్న వారు మెడికల్ షాపుల యజమానులను ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారు. ఏం చేసుకుంటారో, ఎక్కడ చెప్పుకుంటారో చెప్పుకోండి అని తెగేసి చెప్తున్నారు. మెడికల్ షాపులు నిర్వహించాలంటే కొన్ని నిభందనలు పాటించాలి. డ్రగ్ అండ్ కాస్మోటిక్ యాక్టు-1940, ఫార్మసీ యాక్టు-1948 ప్రకారంగా బీ ఫార్మసీ లేదా ఎమ్ ఫార్మసీ పూర్తి చేసిన వారు మాత్రమే మెడికల్ షాపులను నిర్వహించాల్సి ఉంటుంది. షాపు పర్మిషన్ తీసుకునే సందర్భంలో సంబంధిత పార్మసిస్టుల సర్టిఫికెట్లతోపాటు వ్యక్తిగత గుర్తింపు కార్డు ప్రతులు, చిరునామా తదితర వివరాలు దరఖాస్తుతో అనుసంధానం చేసి డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు సమర్పించాలి . తర్వాత సంబంధిత అధికారుల నుంచి అనుమతులు మంజూరైతే...షాపులను నిర్వాహించాలి. అంతేకాదు మందులు విక్రయించడానికి ఫార్మసిస్టులు మెడికల్ షాపుల్లో ఉండాలనే నిబంధన ఉండగా దాన్ని కూడా తుంగలో తొక్కుతున్నారు. మెడికల్ షాపుల్లో ఫార్మసిస్టులు లేకుండానే విక్రయాలు చేపడుతున్నారు. కనీసం ఫార్మసిస్టు పర్యవేక్షణలోనైనా మందులను ఇవ్వాల్సివుండగా 10వ తరగతి, ఇంటర్ అర్హత కల్గిన వారితో మందుల విక్రయాలు చేపడుతున్నారు. ఫార్మసీ పూర్తిచేసిన వారి సర్టిఫికెట్లతో షాపుల నిర్వాహకులు తమ దందాను సాగిస్తున్నారు. ఇందుకు సంబంధిత ఫార్మసిస్టులకు ఏడాదికి లక్షల రూపాయలు చెల్లిస్తున్నారు. షాపుల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. ఎలాంటి అర్హతలు లేకుండానే అడ్డదారిన పర్మీషన్లు పొందుతూ తమ దందాను సాగిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఆర్ఎంపీ, పీఎంపీలు తమ ప్రాథమిక చికిత్స కేంద్రానికి పక్కన వేరే వారి పేరిట మెడికల్ షాపును నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇంత జరుతున్నా సంబంధిత ఔషద నియంత్రణ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, సంబంధిత షాపుల నిర్వాహకుల నుంచి మామూళ్లు ముడుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



## ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గౌరవ పురస్కారాలు

### బి ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 120 మంది విద్యార్థిని, విద్యార్థులకు నగదు, గౌరవ పురస్కారాలు అందజేత.

### ముఖ్య అతిథులుగా డిఆర్ఓ వెంకట్ రెడ్డి, ఎంపీడీవో నరేందర్ రెడ్డి, ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు.








ఇబ్రహీంపట్నం, ప్రభాత సూర్య ప్రతినిధి జూన్ 1 : ఇబ్రహీంపట్నం మండలంలోని ఉప్పరిగూడ గ్రామంలో ఉన్న కేఎంఆర్ ఫంక్షన్ హాల్లో మూడు మండలాలకు సంబంధించి ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల మండలాలకు సంబంధించిన ఉన్నత పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచిన సుమారు 120 మంది విద్యార్థిని, విద్యార్థులు మొదటి 60 మంది విద్యార్థులకు 10,000 రూపాయల బహుమతి రెండవ బహుమతి 55 మంది విద్యార్థులకు 5000 రూపాయల తోపాటు జ్ఞాపికలు ఇచ్చి శాలువాతో విద్యార్థులను సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి డిఆర్ఓ వెంకటాచారి, ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు,ఎంపీడీవో నరేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈకార్యక్రమము బి.ఆర్.ఆర్ ఫౌండేషన్ చైర్మన్, ఉప్పరిగూడ మాజీ సర్పంచ్ బూడిద రామ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని అదేవిధంగా భవిష్యత్తులో బాగా చదివి ఉన్నతమైన మార్గాల్లో పయనించాలని కోరారు. ముఖ్య అతిథులు డీఆర్వో వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మాజీ సర్పంచ్ బూడిద రామ్ రెడ్డి గ్రామానికి చేసిన పనులను గుర్తు చేసుకున్నారు. ఫౌండేషన్ తరపున కరోనా మహమ్మారి కష్ట కాలంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు హైప్రో క్లోరైడ్ ద్రావణాన్ని స్ప్రే చేయించడం, అన్ని గ్రామాల పారిశుద్ధ్య కార్మికులను అందించడం తోపాటు గ్రామానికి ట్రాక్టర్ ఉచితంగా అందించి వైకుంతధామ నిర్మాణానికి తోడ్పడి, గ్రామంలో మల్లికార్జున స్వామి ఆలయాన్ని 35 లక్షల సొంత నిధులతో రైతు వేదిక, ప్రహరీ గోడ 16 లక్షలు సొంత నిధులు వెచ్చించి నూతన పాఠశాల భవనానికి దాతల సహకారంతో పాటు 30 లక్షల రూపాయల సొంత నిధులు తో నిర్మాణం చేయించారని తెలిపారు. అలాగే విద్యార్థులకు సూచనలు ఇస్తూ ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా బోధన జరుగుతున్న సందర్భంలో అందరి పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరి ఉన్నతమైన చదువులు చదవాలని కోరారు. అలాగే ప్రభుత్వం డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించి విద్యార్థుల భవిష్యత్తు డ్రగ్స్ కు అలవాటు కాకుండా సన్మార్గంలో నడిపించాలని కోరారు. అలాగే వచ్చే విద్యా సంవత్సరానికి బడిబాట కార్యక్రమం చేపట్టి పెద్ద ఎత్తున ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, బిఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు, ఉప్పరిగూడ ఉపసర్పంచ్ బూడిద నర్సింహ్మారెడ్డి, రాయపోల్ మాజీ ఎంపీటీసీ గంగిరెడ్డి జ్యోతి భాస్కర్ రెడ్డి, పెద్దలు, గ్రామ యువకులు, పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని


## దుండగుడు బంగారు గొలుసు చోరీ



ఇబ్రహీంపట్నం, ప్రభాత సూర్య ప్రతినిధి జూన్ 1: ఎప్పుడు వస్తారో ఎటునుంచి వస్తారో తెలియదు గుర్తుతెలియని దొంగలు. వచ్చినవారు కాస్త అడ్రస్ చెప్పమని, కాస్త ఫోన్ మాట్లాడకుంటావు ఇవ్వమని, మాటల్లో మాటలు కలుపుతూ అదును చూసి మెడలో ఉన్న బంగారు గొలుసులు లాకెళ్లడం, లేదా బెదిరించి లాకెల్లడం వంటి సంఘటనలు నిత్యం ఏదో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. ఇదంతా పసిడికి ధర ఎక్కువ ఉండడమే కారణం. ఇదే క్రమంలో మూడు తులాల బంగారు గొలుసు చోరీ జరిగిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండలం నోముల గ్రామానికి చెందిన మాదారమోని లక్ష్మమ్మ (70), భర్త నర్సింహ్మా ఇబ్రహీంపట్నం కూరగాయల మార్కెట్ లో ఆకుకూరలు విక్రయిస్తూ జీవనం సాగిస్తుంటుంది. యధావిధిగా ఆదివారం ఉదయం ఆకుకూరలు అమ్ముకుని బస్టాండ్ కు బయలుదేరింది. ఆమె నడుచుకుంటూ వెళ్లే క్రమంలో ఓ గుర్తుతెలియని దుండగుడు ఆమెను వెంబడించి ఆమె మెడలో ఉన్న సుమారు 3 తులాల బంగారు గొలుసు చోరీచేసి కారులో పారిపోయాడు. కాగా భార్య భర్తలు లక్ష్మమ్మ, నరసింహ్మా లబోదిబోమని విలపిస్తూ ఈ ఘటన పై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే ఇబ్రహీంపట్నం ఏసిపి రాజు, సీఐ జగదీష్ తన సిబ్బందితో చోరీ జరిగిన ప్రాంతానికి వెళ్లి క్షుణ్ణంగా పరిసరాలను పరిశీలించి నిందితుని ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు.



## ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి పాలాభిషేకం



షాద్ నగర్ ప్రభాత సూర్య ప్రతినిధి (జూన్ 1) : దేశంలోరైతులు పండించే అన్ని ధాన్యాలకు గిట్టుబాటు ధర కల్పించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి పాలాభిషేకం చేస్తున్నామని రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు శేఖర్ రెడ్డి జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మోటి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కేశంపేట మండల కేంద్రము లో భారతీయ జనతా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ రైతులకు 14 పంటల పైన మద్దతు ధర ఇవ్వడం మరియు కిసాన్ సామాన్ నిధి సకాలంలో రైతుల ఖాతాలలో వేయడం జరుగుతుంది అలాగే ప్రతి ఫర్టిలైజర్ బ్యాగు పైన సబ్సిడీ ఇవ్వడం అన్ని విధాలుగా రైతులను ఆదుకుంటున్నటువంటి ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది బిజెపి ప్రభుత్వం నరేంద్ర మోడీ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ఒక్కటి కూడా ఇంతవరకు అమలు చేసిన పాపాన పోలేదు..? కనుక ప్రజలు కాంగ్రెస్ పార్టీ మీద నమ్మకం కోల్పోయారు కనుక రాబోవు ఎన్నికల్లో తెలంగాణలో బిజెపి ప్రభుత్వం ఏర్పడుతుందనిన విశ్వాసం వ్యక్తం చేశారు. రైతులు పండించే అన్ని ధాన్యాలకు గిట్టుబాటు ధర కల్పించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారికి రైతులు కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తూ పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు శేఖర్ రెడ్డి జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మోటి శ్రీనివాస్ కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు లెంక పోతుల విటల్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షురాలు రొల్లు రాధిక గౌడ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు మహేష్ మండల మాజీ అధ్యక్షులు రఘురాం గౌడ్ యువమోర్చా నాయకులు శివాజీ పాలాది శ్రీనివాస్ నరేందర్ రెడ్డి తట్టేపల్లి నరసింహ మహేష్ గౌడ్ శ్రీను నరేందర్, దర్శన్, కృష్ణయ్య దాసరి యాదయ్య యాదమ్మ తోట కృష్ణ సిల్వర్ లింగయ్య గోపాల్ తదితరులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

## అమెరికా రెట్టింపు సుంకాలతో భారత్‌పై తీవ్ర ప్రభావం



న్యూఢిల్లీ : ఉక్కు, అల్యూమినియంపై అమెరికా సుంకాలను రెట్టింపు చేయడంతో భారత ఎగుమతులు తీవ్రంగా ప్రభావితమవుతాయని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇన్షియేటివ్ (జిటిఆర్‌ఐ) శనివారం పేర్కొంది. ఈ చర్య భారత ఉత్పత్తిదారులు మరియు ఎగుమతిదారుల లాభదాయకతను దెబ్బతీస్తుందని జిటిఆర్‌ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ అన్నారు. భారత్‌పై ఈ పరిణామం ప్రత్యక్షంగా ఉంటుందని అన్నారు. ఈ సుంకాలకు ప్రతిస్పందనగా అమెరికా ఎగుమతులపై భారత్ ప్రతీకార సుంకాలను విధిస్తుందో లేదో చూడాలని అన్నారు. గతంలో విధించిన ఉక్కు సుంకాలకు ప్రతిస్పందనగా అమెరికా వస్తువులపై ప్రతీకార సుంకాలను విధించే ఉద్దేశాన్ని సూచిస్తూ భారత్ ఇప్పటికే ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ)లో అధికారిక నోటీసు జారీ చేసిందని అన్నారు. ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై ప్రస్తుతం ఉన్న 25శాతం సుంకాలను రెట్టింపు చేస్తానని అమెరికా అధ్యక్షులు ట్రంప్ శుక్రవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. 1962నాటి అమెరికా వాణిజ్య విస్తరణ చట్టంలోని సెక్షన్ 232 కింద ఈ పెంపుదల చేశారు. విదేశాల నుండి దిగుమతులు జాతీయ భద్రతకు ముప్పుగా భావిస్తే అధ్యక్షులు సుంకాలు లేదా ఇతర వాణిజ్య పరిమితులను విధించడానికి ఈ చట్టం అనుమతిస్తుంది. 2018లో ఉక్కుపై 25శాతం, అల్యూమినియంపై 10శాతం సుంకాలను విధించేందుకు ట్రంప్ మొదట ఈ సెక్షన్‌ను వినియోగించారు. తిరిగి 2025 ఫిబ్రవరిలో ఉక్కు, అల్యూమినియంలపై సుంకాలను 25శాతానికి పెంచారు. 2024-25లో, భారతదేశం అమెరికాకి 4.56బిలియన్ డాలర్ల విలువైన ఇనుము, ఉక్కు మరియు అల్యూమినియం ఉత్పత్తులను ఎగుమతి చేసింది. వీటిలో 587.5 మిలియన్ డాలర్ల ఇనుము మరియు ఉక్కు, 3.1 బిలియన్ డాలర్లు ఇనుము లేదా ఉక్కు వస్తువులు మరియు 860 మిలియన్ డాలర్లు అల్యూమినియం మరియు సంబంధిత వస్తువులు ఉన్నాయి.

## పేదవాడి కోసం పింఛన్ల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది ఎన్టీఆర్ : సిఎం చంద్రబాబు



చెయ్యేరు : పేదవాడి కోసం పింఛన్ల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది ఎన్టీఆర్ అని ఎపి సిఎం చంద్రబాబు అన్నారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా చెయ్యేరులో ముఖ్యమంత్రి పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన ప్రజావేదిక సభలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే పింఛను మొత్తాన్ని పెంచామన్నారు. పేదవాడి కోసం పింఛన్ల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది ఎన్టీఆర్ అని చెప్పారు. ప్రజల ఆదాయం పెంచి అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. అధిక పింఛన్లు ఇచ్చే ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. తమది పేదల ప్రభుత్వం అని, మెగా డీఎస్సీతో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నామన్నారు. ఉచితంగా మూడు వంటగ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నామని తెలిపారు. పేదలకు మూడుపూటలా అన్నం పెట్టాలన్న సంకల్పంతో పనిచేస్తున్నామన్నారు. ప్రభుత్వ యంత్రాంగం పేదల గురించే ఆలోచించాలన్నారు. ప్రతి గ్రామానికీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్థానిక నేతలు వెళ్లాలని అన్నారు. పింఛను ఇచ్చే కార్యక్రమంలో భాగస్వాములైతే ప్రజల సమస్యలు తెలుస్తాయని అన్నారు. పేదల కోసం కష్టపడుతున్నామని అన్నారు. చేప ఇవ్వడమే కాదు.. పట్టిచ్చే విధానం నేర్పుతాం అని అన్నారు. భర్త చనిపోతే ఆటోమేటిక్‌గా భార్యకు పింఛను ఇచ్చే వెసులుబాటును తీసుకొచ్చామన్నారు. మూడునెలల వరకు పింఛను తీసుకునే వెసులుబాటు కల్పించామని అన్నారు. భర్త చనిపోతే భార్య అనాథగా మిగిలిపోకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నామని చంద్రబాబు వివరించారు.

## పవన్ కీలక నిర్ణయం.. నెలలో 15 రోజులు, రెండు పూటలా రేషన్ పంపిణీ..!



**అమరావతి,:** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. నెలలో 15 రోజులు, రెండు పూటలా రేషన్ సరకుల పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. ఆ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పేదలకు ప్రభుత్వం అందించే రేషన్ సరుకుల చౌక ధరల దుకాణాలు గత ప్రభుత్వంలో మూసేసి, ఇంటింటికి అందిస్తాం అని రూ.1600 కోట్లతో వాహనాలు కొనుగోలు చేసిన విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గుర్తు చేశారు. ఇంటింటికి ఇవ్వడం మానేసి నెలలో 1-2 రోజులు మాత్రమే జంక్షన్లలో వాహనం నిలిపి ఇవ్వడంతో ఎంతోమంది పేదలకు ఆ సరుకులు అందక ఇబ్బందులుపడ్డారని ఆరోపించారు. ఆ వాహనం ఎప్పుడు వస్తుందో తెలియక రోజువారీ పనులు మానుకొని, చిరుద్యోగాలకి సెలవు పెట్టుకోవాల్సి వచ్చేదని పేర్కొన్నారు.ఎమిగిలిన రేషన్ బియ్యం, సరుకులను అక్రమంగా తరలిస్తున్న విషయంపై సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపిందని వెల్లడించారు. వేలాది టన్నుల అక్రమ బియ్యాన్ని కాకినాడ, విశాఖ పోర్టుల్లో పట్టుకున్నారని.. వీటిని అరికట్టేందుకు, ప్రతీ పేద కుటుంబానికి రేషన్ సరుకులు అందించేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15 వ తేదీ వరకు.. ఉదయం 8 గం.ల నుంచి 12 గం.ల వరకు అలాగే సాయంత్రం 4గం. ల నుంచి 8 గం.ల వరకు రేషన్ డీలర్ల దుకాణాల వద్ద అందించనున్నట్లు పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. దీని ద్వారా రద్దీని తగ్గించడమే కాకుండా, ప్రతీ ఒక్క కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుందని వెల్లడించారు. దివ్యాంగులకు, 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందించే సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం కల్పించినట్లు తెలిపారు. ఈ సదుపాయాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్రంలో గోశాలల అభివృద్ధి, గోవుల సంరక్షణపై సీఎం రేవంత్ సమీక్ష..



**హైదరాబాద్, :** తెలంగాణ రాష్ట్రంలో గోశాలల అభివృద్ధి, నిర్వహణ, సంరక్షణపై కమాండ్ కంట్రోల్ సెంటర్ లో అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, గోశాలల ఏర్పాటుకు సంబంధించి కమిటీని ఏర్పాటు చేయాలని, నిర్ణీత గడువులోగా కమిటీ పూర్తిస్థాయి ప్రణాళికతో రావాలని సీఎం ఆదేశించారు. గో సంరక్షణ, నిర్వహణ సులువుగా ఉండేందుకు వీలుగా గోశాలల ఏర్పాటు ఉండాలన్నారు. మొదటి దశలో రాష్ట్రంలోని వెటర్నరీ యూనివర్సిటీ, కళాశాలలు, అగ్రికల్చర్ యూనివర్సిటీ, కళాశాలలు, దేవాలయాలకు సంబంధించిన భూముల్లో గోశాలలు ఏర్పాటు చేయాలని సూచించగా.. అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించాలని అన్నారు. కనీసం 50 ఎకరాల విస్తీర్ణానికి తగ్గకుండా గోశాలలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ పేర్కొన్నారు. అయితే, ఇరుకు స్థలాల్లో బంధించినట్లుగా కాకుండా మేత మేసేందుకు, స్వేచ్ఛగా తిరిగేందుకు వీలుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అత్యాధునిక సౌకర్యాలతో గోశాలలు ఏర్పాటు చేసేందుకు పూర్తిస్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్వహణ, సంరక్షణలో ధార్మిక సంస్థలను భాగస్వాములను చేసే అంశాన్ని పరిశీలించాలని అన్నారు. గోశాలల నిర్మాణం, నిర్వహణ, సంరక్షణకు సంబంధించి పూర్తిస్థాయి బడ్జెట్ అంచనాలతో ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎనికేపల్లిలో ఏర్పాటు చేయనున్న గోశాలకు సంబంధించి పలు డిజైన్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. షెడ్ల నిర్మాణం, ఇతర డిజైన్లలో పలు మార్పులను సూచించారు. మరో నాలుగైదు రోజుల్లోగా తుది మోడల్ ను ప్రభుత్వం ఖరారు చేయనుందని సీఎం తేల్చి చెప్పారు.

# ఆయుధాల పందేరం!



రాజ్యాంగాన్ని మనం అమలు చేసుకోవటం మొదలెట్టి 75 ఏళ్లవుతుండగా మన పాలకుల విపరీత పోకడలు దాన్ని కాస్తా భ్రష్టుపట్టించే దిశగా సాగుతున్నాయి. రాష్ట్రంలోని సరిహద్దులకు సమీపంగా వుండే మారుమూల ప్రాంతాల్లోని స్థానిక తెగలకూ, నివాసితులకూ ఆయుధాల లైసెన్స్‌లుమంజూరు చేయాలని అస్సాం మంత్రివర్గం బుధవారం నిర్ణయించటం ఆ కోవలోనిదే. సరిహద్దు ఆవలి నుంచి చొరబడి బెదిరింపులకు దిగేవారి నుంచి రక్షణ కోసం, వ్యక్తిగత భద్రత కోసం ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ చెబుతున్నారు. 'జాతి, నేల, స్థానికత' కాపాడటం కోసమే ఇలా చేస్తున్నామని ఆయన ప్రకటించారు. బంగ్లాదేశ్ పొడవునావుండే రెండు జిల్లాల్లోని ఆరు ప్రాంతాల వాసులకు ఈ ఆయుధాల లైసెన్స్‌లు లభిస్తా యని ఆయన చెప్పారు. ఈ ప్రాంతాలన్నిటా ముస్లింల జనాభా ఎక్కువ. ఇప్పుడు జనం చేతికి తుపాకులందితే మత ఉద్రిక్తతలు పెరిగినప్పుడల్లా తుపాకులు మాట్లాడటం మొదలవుతుంది. ఇది ప్రభుత్వానికి మంచిదేనా? 1985 నుంచీ ఆ ప్రాంతాలవారు ఈ లైసెన్స్‌ల కోసం డిమాండ్ చేస్తుంటే గత ప్రభుత్వాలేవీ సాహసించలేదని, వాటికి ధైర్యంలేదని శర్మ వివరిస్తున్నారు. ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకొనేది తమకు రక్షణ, భద్రత కల్పిస్తాయని, మౌలిక సదుపాయల కల్పనపై శ్రద్ధ పెడతాయని, తమ బతుకులు మెరుగుపరచటానికి అవసరమైన పథకాలు రూపొందిస్తాయని ఆశించబట్టే! ఇంతకూ 'ధైర్యం లేని' గత ప్రభుత్వాల్లో తాను మంత్రిగా పనిచేసిన కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలున్నట్టేనా? ఆ కాలాల్లోని ప్రభుత్వాలకు 'ధైర్యం' కలిగించేందుకు తాను చేసిందేమిటి? తాను విఫలమైన పక్షంలో దానిపై నిలదీయకుండా మౌనంగా ఎందుకు ఉండిపోయినట్టు? దాదాపు పాతికేళ్లుగా శర్మ రాజకీయాల్లో వుంటున్నారు. ఆయన కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల్లో కీలక శాఖలకు మంత్రిగా వ్యవహరించారు. 2015లో కాంగ్రెస్ నుంచి తప్పుకోవటానికి కూడా కారణం ఆ సర్కార్‌కు ధైర్యం లేదని కాదు. తన రాజకీయ ఎదుగుదలకు అప్పటి సీఎం తరుణ్ గొగోయ్ అడ్డంకిగా మారటం! దీన్నంతటినీ రాహుల్‌గాంధీని కలిసి మొరపెట్టుకోవాలని శర్మతీవ్రంగా ప్రయత్నించారు.

కానీ జనాదరణగల యువ నాయకుల కన్నా పీఠాధిపత్యం నెరపే వృద్ధ తరం నేతలకే పెద్దపీట వేసే సంస్కృతిగల కాంగ్రెస్‌లో అది సాధ్యపడలేదు. నేపథ్యం ఏమైనా బీజేపీలో శర్మ బాగా రాణించారు. ఏనాటినుంచో ఆ పార్టీలో వున్న నేతలను తలదన్నే విధంగా ప్రకటనలిచ్చి వివాదాస్పదుడూ అయ్యారు. అందువల్ల పార్టీలో ఆయన పట్టు పెరిగింది గనుకే 2021లో బీజేపీ అధిష్ఠానం శర్మను అస్సాం ముఖ్యమంత్రిగా ఎంపిక చేసింది. కానీ గత ప్రభుత్వాలు తుపాకీ లైసెన్స్‌లు ఇవ్వకపోవటానికి వాటికి ధైర్యం లేకపోబట్టే అని ఆయన దేని ఆధారంగా నిర్ణయానికొచ్చారో చెప్పలేదు. శర్మ చెబుతున్న ప్రకారం ఆ ప్రభుత్వాలు సాహసించలేక పోబట్టి చాలామంది స్థానిక తెగలవారు బయటి వ్యక్తుల ఒత్తిళ్లకు లొంగి భూములు అమ్ముకోవాల్సి వచ్చింది. అక్కణ్ణించి వలసలు పోవాల్సి వచ్చింది. మరి ప్రభుత్వాల వైఖరి వల్ల జనం ఇన్ని ఇబ్బందులు పడుతుంటే ఆయన మౌనంగా మిగిలిపోవటం ఎందువల్ల? హిమంత గ్రహించాల్సిన విషయం ఒకటుంది. గతంలో ప్రజల నుంచి ఎన్ని డిమాండ్లు వచ్చినా అప్పటి ప్రభుత్వాలు ఆయుధ లైసెన్సులివ్వకపోవటానికి కారణం ధైర్యం లోపించి కాదు. అది అనైతికమూ, రాజ్యాంగ విరుద్ధమూ అని విశ్వసించటం వల్ల! అమెరికాలో పౌరులెవరైనా ఆయు ధాలు కొనుక్కోవచ్చు. అందుకు కొన్ని నిబంధనలున్నా ఆచరణలో అవి ఏమవుతున్నాయో అక్కడ తరచు జరిగే ఉదంతాలు గమనిస్తే అర్థమవుతుంది. అక్కడ సగటున 100 మంది పౌరులకూ 120.5 తుపాకులున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. నిరుడు తుపాకీ మరణాలు 30,000 మించాయి. అకారణంగా లేదా భయపడి తరచు అవతలివారిని చంపుతున్న ఉదంతాలు ఎక్కువ. ఆ దేశంలో కూడా హిమంత ప్రభుత్వం ఏకరువు పెడుతున్న నిబంధల వంటివే వున్నాయి. మానసికంగా సక్ర మంగా వుండి అవతలివారి నుంచి ప్రాణభయం ఉన్న 21 ఏళ్లు పైబడినవారందరికీ లైసెన్సులిస్తా మని హిమంత చెబుతున్నారు. ఏదైనా కేసులో శిక్షపడినా, శాంతికి దోహదపడతామని గతంలో ప్రభుత్వానికి బాండు రాసిచ్చినా అనర్హులవుతారట. అంతేగాక మానసికంగా, శారీరకంగా సరైన స్థితిలో వున్నవారికే లైసెన్సులు జారీచేస్తారట. ఒకసారంటూ కళ్లెం వదిలాక ఇవన్నీ నిజాయతీగా, చిత్తశుద్ధిగా అమలవుతాయా? అనుమానమే! అస్సాం మొదటినుంచీ సమస్యాత్మక రాష్ట్రం. అక్రమంగా చొరబడిన విదేశీయులను వెనక్కిపంపాలంటూ ఉవ్వెత్తున లేచిన విద్యార్థి ఉద్యమం, అటుతర్వాత ఉల్ఫా లాంటి ఉగ్రవాద సంస్థల ఆగడాలు తెలియంది కాదు. నిత్యం అపహరణలు, డబ్బు దండుకోవటం, హత్యలు ఒకప్పుడు చాలా అధికం. సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) జవాన్లు, పోలీసులు ఉల్ఫా ఆటకట్టించాక అవి చాలావరకూ తగ్గిపోయాయి. ఇప్పటికీ బీఎస్ఎఫ్ జవాన్లు సరిహద్దుల్లో నిత్యం పహారా కాస్తుంటారు. సమస్య వుందనుకుంటే మరింతమందిని నియమించి, పటిష్ఠమైన పర్యవేక్షణ అమలు చేయటం పెద్ద కష్టం కాదు. అందుకు భిన్నంగా లైసెన్సులిస్తామంటే ప్రభుత్వం చేతులెత్తేసినట్టు కాదా? ఇలాంటి కారణాల వల్లే గతంలో ఛత్తీస్‌గఢ్‌లో సుప్రీంకోర్టు సల్వాజుడుంను రద్దుచేసింది. పైగా అస్సాంకు భారీయెత్తున పెట్టుబడులు తీసుకొస్తామని చెబుతూ శాంతికి విఘాతం కలిగించే ఇలాంటి విధానం అమలు చేయటం సరైందేనా? హిమంత ఆలోచించాలి.

# ఉష్ణోగ్రతల పెరుగుదలతో వేగంగా కరిగిపోతున్న హిమానీనదాలు

### ముంచుకొస్తున్న ముప్పు
### మరో 2 డిగ్రీలు పెరిగితేహిందూకుష్‌లో 75 శాతం మంచు మాయం
### ఆసియాలో 200 కోట్ల మంది మనుగడకు ప్రమాదం
### 10 దేశాల సైంటిస్టుల అధ్యయనంలో వెల్లడి
### గ్లేసియర్లను కాపాడుకోవడంపై దృష్టి పెట్టాలంటున్న పర్యావరణ నిపుణులు



న్యూఢిల్లీ: హిమాలయ పర్వతాలు భారతదేశానికి పెట్టని కోటలాంటివి. హిమాలయాల్లోని 800 కిలోమీటర్లకుపైగా పొడవైన హిందూకుష్ పర్వత శ్రేణిలో ఎన్నెన్నో హిమానీనదాలు(గ్లేసియర్స్) ఉన్నాయి. ఎన్నో నదులు, సరస్సులకు ఇవే ఆధారం. మధ్య, దక్షిణాసియాలో హిందూకుష్ గ్లేసియర్స్ నుంచి వచ్చే నీటిపై ఆధారపడి 200 కోట్ల మంది జీవనం సాగిస్తున్నారు. కర్బన ఉద్గారాలు, వాతావరణ మార్పుల వల్ల ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతుండడంతో హిమానీనదాలు వేగంగా కరిగిపోతున్నాయి. పారిశ్రామిక యుగానికి ముందున్న ఉష్ణోగ్రతల కంటే మరో 2 డిగ్రీల సెల్సియస్‌కుపైగా పెరిగితే ఈ శతాబ్దం ఆఖరు నాటికి హిందూకుష్ హిమానీనదాల మంచులో 75 శాతం అంతమైపోతుందని తాజా అధ్యయనంలో వెల్లడయ్యింది. 200 కోట్ల మంది జీవనం ప్రమాదంలో పడుతుందని తేలింది. ఈ అధ్యయనం వివరాలను సైన్స్ జర్నల్‌లో ప్రచురించారు. భూగోళంపై మానవ మనుగడ కొనసాగాలంటే వాతావరణ మార్పుల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణపై ప్రపంచ దేశాలన్నీ తక్షణమే దృష్టిపెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. 10 దేశాలకు చెందిన 21 మంది శాస్త్రవేత్తలు ఉమ్మడిగా ఈ అధ్యయనం నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా 2 లక్షలకుపైగా గ్లేసియర్లలో మంచు కరుగుతున్న తీరును పరిశీలించడానికి 8 గ్లేసియర్ మోడల్స్ ఉపయోగించారు. ఉష్ణోగ్రతలు మరింత పెరగకుండా స్థిరంగా ఉన్నప్పటికీ గ్లేసియర్లలో మంచు కరగడం ఇప్పట్లో ఆగదని అధ్యయనకర్తలు స్పష్టంచేశారు. రాబోయే కొన్ని దశాబ్దాలపాటు ఈ పరిమాణం కొనసాగు తూనే ఉంటుందని పేర్కొన్నారు. ఉష్ణోగ్రత కేవలం అర డిగ్రీ పెరిగినా సరే దాని ప్రభావం హిమానీనదాలపై కచ్చితంగా ఉంటుందని, ఈ మేరకు మంచు కరిగిపోతుందని సైంటిస్టు డాక్టర్ హ్యారీ జెకొల్లారీ చెప్పారు. మనం ఈ రోజు తీసుకొనే నిర్ణయాలు మన భవిష్యత్తు తరా ల బతుకులను నిర్ణయిస్తాయని అన్నారు. రాబోయే తరాలు బాగుండాలంటే గ్లేసియర్లను కాపాడుకోవాలని సూచించారు. పారిస్ వాతావరణ ఒప్పందం ప్రకారం.. భూమిపై ఉష్ణోగ్రతల పెరుగుదలను 1.5 డిగ్రీలకు పరిమితం చేస్తే హిమాలయాలు, కాకస్ పర్వతాల్లో 40-45 శాతం మంచును కాపాడుకోవచ్చు. ఒకవేళ ఉష్ణోగ్రతలు 2.7 డిగ్రీలు పెరిగితే ప్రపంచవ్యాప్తంగా 75 శాతం మంచు కరిగిపోతుంది. ఈ శతాబ్దం ఆఖరు నాటికి కేవలం 25 శాతమే మిగిలి ఉంటుంది. యూరప్‌లో ఆల్ప్స్, ఉత్తర అమెరికాలో రాకీస్‌తోపాటు ఐస్‌ల్యాండ్‌లోని గ్లేసియర్లు మానవులకు జీవనాధారం కల్పిస్తున్నాయి. ప్రస్తుతం వీటికి ముప్పు పొంచి ఉంది. భూగోళం మరో రెండు డిగ్రీలు వేడెక్కితే.. ఇక్కడ మంచు 10-15 శాతమే మిగులుతుందని అంచనా వేస్తున్నారు. దాదాపు 90 శాతం మంచు కనుమరుగైతే పరిస్థితి తీవ్రత ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇక స్కాండినేవియా ప్రాంతంలో మంచు పూర్తిగా కరిగిపోతుందన్న అంచనాలున్నాయి. హిమానీనదాలపై ఐక్యరాజ్యసమితి తొలి సదస్సు ప్రస్తుతం తజకిస్తాన్‌లోని దుషాన్బేలో జరుగుతోంది. 50కిపై దేశాలు ఇందులో పాల్గొంటున్నాయి. గ్లేసియర్లు వేగంగా కరిగిపోతుండడం వల్ల ఆసియాలో 200 కోట్ల మందికి కష్టాలు రాబోతున్నాయని ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఉపాధ్యక్షుడు యింగ్‌మింగ్ యాంగ్ హెచ్చరించారు. ఆసియా, పసిఫిక్ ప్రాంతాల్లో సమీప భవిష్యత్తులో తీవ్రమైన వరదలు, కరువులు సంభవించే ప్రమాదం ఉందని, సముద్ర నీటి మట్టం పెరగడం వల్ల తీర ప్రాంతాలు మునిగిపోతాయని చెప్పారు. మంచు కరిగిపోవడాన్ని ఆపాలంటే శిలాజ ఇంధనాలను పక్కనపెట్టాలని, క్లీన్ ఎనర్జీని ఉపయోగించుకోవాలని యింగ్‌మింగ్ యాంగ్ స్పష్టంచేశారు. భూమిని అగ్నిగుండంగా మారుస్తున్న కాలుష్య ఉద్గారాలకు కళ్లెం వేయాలన్నారు.

# అవమానకరంగా వైదొలిగిన ఎలన్ మస్క్!



ఎలన్‌మస్క్, ప్రపంచ కుబేరుడు, అమెరికా అధినేత ట్రంప్ మానసపుత్రుడు, స్వల్పకాలమే అయినా అసాధారణ అధికారాలను వెలగబెట్టిన అత్యంత వివాదాస్పద వ్యక్తి. తన 130 రోజుల నియామక వ్యవధి కంటే రెండు రోజులు ముందుగా పదవి నుంచి తప్పుకున్నాడు. గడువుకంటే ముందా వెనుకా అన్నది కాదు తప్పుకున్న తీరే అత్యంత అవమానకరంగా జరిగిందన్నదే చర్చ. మితవాద భావజాల పరంగా ఇతరంగా ట్రంప్‌ను ఆకాశానికి ఎత్తటమే కాదు, రిపబ్లికన్ పార్టీ విజయానికి 30 కోట్ల డాలర్లకు పైగా నిధులు ఇచ్చిన మస్క్ రాజీనామా చేసే ముందు కనీసం ట్రంప్‌తో కూడా చెప్పలేదని వార్తలు. ఇది రాసిన సమయానికి అసలైన కారణాలు ఇంకా తెలియలేదు. ప్రభుత్వశాఖల్లో అసమర్ధత, అనవసరపు ఖర్చును తగ్గించేందుకు ఏర్పాటు చేసిన శాఖ "డోజ్ " సలహాదారుగా మస్క్ తీసుకున్న చర్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. అంతా సజావుగా ఉంటే అదే పదవిలో లేదా మరొకదానిలో ఎలన్ మస్క్‌ను ట్రంప్ కొనసాగించి ఉండేవాడు. ప్రారంభం నుంచి దూకుడుతో వ్యవహరించి సాధించిందేమీ లేకపోగా ఉద్యోగులు, సాధారణ పౌరుల నుంచి తీవ్ర అసంతృప్తి, కొందరు మంత్రులు, ఉన్నతాధికారులతో దెబ్బలాటలు చివరికి ఈ తలనొప్పి ఏమిటిరా బాబూ అని రిపబికన్ పార్టీ నేతలు తలలు పట్టుకొనేంతగా రెచ్చిపోయాడంటే అతిశయోక్తి కాదు. పేనుకు పెత్తనమిస్తే ఏం జరుగుతుందో తెలిసినప్పటికీ ఇలాంటి వారికి అధికారమిస్తే ఏవిధంగా వ్యవహరిస్తారో ఒక్క అమెరికాకే కాదు, ప్రపంచ దేశాలన్నింటికీ ఒక గుణపాఠం నేర్పాడు. రెండులక్షల కోట్ల డాలర్లకు పైగా బడ్జెట్‌లోటును తగ్గిస్తామని ఎన్నికల్లో చెప్పిన ట్రంప్ ఐదు నెలలు కూడా గడవక ముందే 2.3లక్షల కోట్ల అదనపులోటుకు దారితీసే పన్నుల బిల్లును ప్రతిపాదించాడు. దాన్ని బహిరంగంగా తూర్పారపట్టిన మరుసటి రోజే ఎలన్ మస్క్ తాను బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. లేకపోతే ట్రంపే తొలగించి ఉండేవాడేమో ! పొదుపు పేరుతో అనేక సంక్షేమ పథకాలకు కోత ప్రకటించాడు. బెదిరించి, కొందరిని పొమ్మనకుండానే పొగబెట్టి, మరి కొంత మందికి పాకేజ్‌లు ఇచ్చి ఇరవైమూడు లక్షల మంది ఫెడరల్ ఉద్యోగుల్లో 2.6లక్షల మందిని ఇంటికి పంపించాడు. 1930దశకంలో తలెత్తిన మహా ఆర్థిక సంక్షోభంలో సర్వం కోల్పోయిన జనం వీధుల్లో గుడారాలు వేసుకొని తలదాచుకున్నారు, వాటిని నాటి అధ్యక్షుడు హూవర్ పేరుతో వ్యంగ్యంగా పిలిచినట్లే, మస్క్ దెబ్బకు వీధులపాలనై వారు కూడా అదే మాదిరి నిరసన తెలుపుతూ వేసిన గుడారాలకు మస్క్ పేరు పెట్టారు. ట్రంప్-మస్క్ విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ నెలలో లక్షలాది మంది కార్మికులు దేశమంతటా ప్రదర్శనలు జరిపారు. మస్క్ టెస్లా కంపెనీ కార్యాలయాలు, ఫ్యాక్టరీల ముందు నిరసన ప్రదర్శనలు చేశారు. వ్రతం చెడ్డా ఫలం దక్కిందా అంటే కైవలం 17,500 కోట్లు మాత్రమే తగ్గించగలిగినట్లు వార్తలు. తాను పొదుపు చేస్తుంటే అధ్యక్షుడు ట్రంప్ 2.3లక్షల కోట్ల డాలర్ల లోటును పెంచే పన్నుల బిల్లును తెచ్చినట్లు ఒక టీవీలో బహిరంగంగా మస్క్ తూర్పారబట్టాడు. నిజానికి మస్క్ గత కొద్ది వారాలుగా వ్యవహరించిన తీరు, పెట్టిన ఎక్స్ పోస్టులు, మీడియాలో స్పందనలను చూస్తే పదవిలో నిలిచేరకం కాదని అనేక మంది భావించారు. ఊరంతా కావమ్మ మొగుడు అంటే నేను కూడా కామోసు కామోసు అనుకొని కాపురం చేశాను, ఇప్పుడు కాదంటున్నారు గనుక నా కఱ్ఱా బుఱ్ఱా ఇస్తే నా దారిన నేపోతా అన్న ఒక సన్యాసి కథ తెలిసిందే. ఎలన్ మస్క్‌ను కూడా అమెరికా ఆర్థిక ఇబ్బందులను పొదుపు, సామర్థ్యంతో గట్టెక్కించే దూత అని భావించారు.

అయితే ఎలన్ మస్క్ సన్యాసి కాదు గనుక తన టెస్లా, స్టార్‌లింక్, స్పేస్‌ఎక్స్ వంటి కంపెనీలను చూసుకుంటా రోజంతా అక్కడే ఉంటా అవసరమైతే రాత్రుళ్లు కూడా అక్కడే పడుకుంటానంటూ ముందుగానే వెల్లడించాడు. మస్క్ చివరికి తన గాంగ్ నుంచి ఇలా నిష్క్రమిస్తాడని ట్రంప్ కూడా ఊహించి ఉండడు. ఇతర దేశాలనుంచి దిగుమతి చేసుకొనే వస్తువుల మీద ప్రతికూల పన్నులు వేసి జనాల జేబులను గుల్లచేసే ట్రంప్ విధానాలకు తీవ్ర ప్రతిఘటన ఎదురవుతున్నది. ప్రకటించిన పన్నులను అమలు చేస్తే జనంలో వ్యతిరేకత, తోకముడిస్తే ప్రపంచంలో చులకన. డోనాల్డ్ ట్రంప్ ఇరకాటంగా ఇది కనిపించినప్పటికీ అమెరికా పెట్టుబడిదారీ విధానం ఎదుర్కొంటున్న సంక్షోభంలో ఒక అంశంగా మస్క్ ఉదంతాన్ని చూడవచ్చు.

RNI : APTEL/2023/88525
జనం న్యూస్
తెలుగు జాతీయ దినపత్రిక

సంపాదకీయం

# విద్యార్థుల వీసాల విలాపం

## (విశ్లేషణ)

అగ్రరాజ్యం అమెరికాలో విదేశీ, ముఖ్యంగా భారతీయ విద్యార్థుల భవిష్యత్ అయోమయంలో పడింది. వీసా రద్దు చేయడం, ఒపిటిపై ఆంక్షలు విధించడం, ఫెడరల్ నిధుల కోతలు వంటివి ఆందోళనకు దారితీస్తున్నాయి. తాజాగా విద్యార్థుల వీసాల ఇంటర్వ్యూలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. అమెరికాలోని కొన్ని విశ్వవిద్యాలయాల్లో అమెరికా వ్యతిరేక, హమాస్ అనుకూల భావజాలం పెరిగిపోతోందని, చైనా కమ్యూనిస్టు పార్టీతో కొంతమంది విద్యార్థులకు సంబంధాలు ఉంటున్నాయని ఇలా అనేక ఆరోపణలపై అభ్యర్థుల సోషల్ మీడియా ఖాతాలను అమెరికా ఇమ్మిగ్రేషన్ విభాగం అధికారులు క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. అయితే ఈ పరిశీలనకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసే వరకు వీసాల బుకింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు అమెరికా అధికార యంత్రాంగం ప్రకటించింది. వీసాకు దరఖాస్తు ఫారమైన డిఎస్ 160 ద్వారా 201112 నుంచే సోషల్ మీడియా ఖాతాలను అడుగుతున్నారు. అయితే దరఖాస్తుదారుల ఖాతాలన్నిటినీ వేగంగా తనిఖీ చేసే విధానం ఇంకా లేకపోవడంతో ఎప్పుడు వీసాల ఇంటర్వ్యూలు ఉంటాయో తెలియడం లేదు.అమెరికా యూనివర్శిటీలు ఆగస్టు డిసెంబర్, జనవరి మే సెమిస్టర్లకు రెండుసార్లు ప్రవేశాలు కల్పిస్తాయి. సాధారణంగా భారతీయ విద్యార్థులు ఆగస్టు డిసెంబర్ సెమిస్టర్‌నే ఎంపిక చేసుకుంటారు. దీంతో ఆరునెలల ముందునుంచే వీసా కోసం ప్రయత్నిస్తుంటారు. విద్యార్థులకు ఇచ్చే ఎఫ్1వీసాను నాన్‌ఇమ్మిగ్రెంట్ వీసా అంటారు. అమెరికాలో పూర్తికాలం విద్యకు ఈ వీసా అవకాశం కల్పిస్తుంది. 2023 లో 1.03 లక్షల మంది భారతీయ విద్యార్థులకు వీసాలు (%ఎఱయిం ర్బఎవత్ం%) అందగా, 202324 లో ఎఫ్1 వీసాలను భారీగా తగ్గించారు. 2024లో మొదటి 9 నెలల్లోనే భారతీయ విద్యార్థులు 38% మందికి అమెరికా వీసాలు తిరస్కరించింది. ఈ ఏడాది తొలి సెమిస్టర్ కోసం దాదాపు 78 వేల మంది వీసా కోసం దరఖాస్తు చేసుకోగా, ఇప్పటివరకు 24 వేల మందికి ఇంటర్వ్యూ తేదీలు వచ్చాయి. కొందరికి ఇంటర్వ్యూలు జరిగాయి.ఇందులో 6 వేలమంది వివిధ కారణాలవల్ల తిరస్కరణకు గురయ్యారు. ఇక 54 వేల మంది ఇంటర్వ్యూ తేదీ కోసం ఎదురు చూస్తున్నారు. అమెరికా అనుసరించే సోషల్ మీడియా వెట్టింగ్ విధానం విదేశీ విద్యార్థుల వీసా ప్రక్రియపై పెను ప్రభావం చూపనుంది. అంతేకాదు అమెరికా యూనివర్శిటీలపై ఆర్థిక భారం కూడా పడుతుంది. భారత్ నుంచి ఏటా 7 లక్షల మంది విదేశీ విద్యకు వెళ్తున్నారు. ఇందులో 3 లక్షల మంది అమెరికాకే వెళ్తున్నారు. మన విద్యార్థులు చదువుకోసం ప్రతి ఏటా రూ. లక్ష కోట్లు చెల్లిస్తున్నారని భారత విదేశీ మంత్రిత్వశాఖ తెలియజేసింది. ఏటా భారత్ నుంచి వెళ్లే విద్యార్థుల్లో 40 వేల నుంచి 50 వేల మంది తెలుగువారే ఉండేవారు. అయితే అక్రమ వలసదారులను పట్టుకుని తిరిగి పంపించడం ప్రారంభించాక పార్ట్‌టైమ్ చేస్తున్న భారత విద్యార్థుల సంఖ్య బాగా తగ్గింది. ఏటా వెళ్లే వారిలో 50% అమెరికా చదువులను వాయిదా వేసుకోవలసి వచ్చింది. గత ఏడాది 2.7 లక్షలకు పైగా భారత విద్యార్థులు అమెరికాలో నమోదయ్యారు.దీనివల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థకు 43.8 బిలియన్ డాలర్ల (రూ. 3,73,982 కోట్లు) ఆదాయం సమకూరింది. 202324లో 10 లక్షలకు పైబడిన విదేశీ విద్యార్థుల వల్ల అమెరికాకు దాదాపు 4400 కోట్ల డాలర్ల సంపద సొంతమైంది. 3.78 లక్షల ఉద్యోగాల కల్పన సాధ్యమైంది. అమెరికా వర్శిటీల్లో చదువుకున్న విదేశీయుల్లో చాలా మంది అక్కడే స్టార్టప్‌లు, ఇతర వ్యాపారాలు నెలకొల్పుతూ స్థానిక ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. అమెరికాలో చదువుకున్న అంతర్జాతీయ విద్యార్థుల్లో భారతీయులు మొదటి స్థానంలోను, చైనీయులు రెండో స్థానంలోను ఉన్నారు. 2023 24 సంవత్సరంలో చైనా నుంచి 2 లక్షల 70 వేలమంది విద్యార్థులు అమెరికా చదువులకు వెళ్లారు. అమెరికాలో ఉన్న విదేశీ విద్యార్థుల్లో నాలుగోవంతు చైనీయులే ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా రాయబార కార్యాలయాల్లో కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థుల వీసా ఇంటర్వ్యూలను తాత్కాలికంగా నిలిపివేయడంపై చైనా స్పందించింది. అంతర్జాతీయ విద్యార్థులతో సహా చైనా విద్యార్థుల చట్టబద్ధమైన హక్కులు, వారి ప్రయోజనాలను కాపాడాలని అమెరికాను కోరింది. ఇరుదేశాల మధ్య విద్యాపరమైన విషయాల్లో ఎలాంటి అడ్డంకులు రాకుండా చూసుకోవాలని సూచించింది. అంతర్జాతీయ విద్యార్థుల అడ్మిషన్ల పైన, వారి ట్యూషన్ ఫీజుల పైన ఆధారపడిన అమెరికా విశ్వవిద్యాలయాలకు ట్రంప్ సర్కారు విధానాల వల్ల ఆర్థిక కష్టాలు మరింత ఎక్కువ కానున్నాయి. ఇటీవలే హార్వర్డ్ వంటి ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలపై ట్రంప్ సర్కారు నిషేధం విధించడం లక్షలాది మంది విద్యార్థుల కలలను చెరిపివేస్తోంది. ఇంతేకాకుండా క్లాసులకు గైర్హాజరైతే వీసాలు రద్దంటూ మరో కఠోర నిర్ణయాన్ని తెరపైకి తీసుకువచ్చారు. ఈ పరిణామాలన్నిటి నేపథ్యంలో అమెరికాలో సగటు భారతీయ విద్యార్థి పరిస్థితి ఏమిటి? అన్న ప్రశ్న ఎదురవుతోంది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న భారతదేశంలో విద్యార్థులు చదువులకోసం విదేశాలకు వెళ్లాల్సిన అవసరం ఉందా? అమెరికా అధ్యక్షుడి సలహా సంఘం మాజీ సభ్యుడైన అజయ్ భుటోరియా తాజా పరిణామాలపై స్పందిస్తూ కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థుల ఇంటర్వ్యూలను అమెరికా నిలిపివేయడం ముఖ్యంగా భారతీయ విద్యార్థులకు ఆందోళన కలిగించే అంశమని వ్యాఖ్యానించారు. ఎంతో మంది భారతీయ విద్యార్థుల చదువుల కలలను భగ్నం చేస్తుందన్నారు.

# భారత్, రష్యా-చైనా QUAD కి ప్రతిగా మారుతాయా? రష్యా మంత్రి సంచలన వ్యాఖ్యలు!


మారుతున్న ప్రపంచ దౌత్య చిత్రంలో, భారతదేశం, రష్యా, చైనా అనే త్రయం మరోసారి వార్తల్లో నిలిచింది. ఈసారి రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్ స్వయంగా ఈ సూచనలు చేశారు. సరిహద్దు ఉద్రిక్తతకు సంబంధించి భారత్-చైనా మధ్య ఒక అవగాహన కుదిరిందని, ఇప్పుడు రష్యా-భారత్-చైనా త్రైపాక్షిక వేదికను తిరిగి ప్రారంభించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన స్పష్టం చేశారు. ఈ వేదిక అమెరికా ప్రభావాన్ని సమతుల్యం చేయడానికి, ఆసియా ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడానికి ఒక దృఢమైన మాధ్యమంగా మారగలదు. అమెరికా నేతృత్వంలోని క్వాడ్ గ్రూప్ ఆసియాలో సైనిక కార్యకలాపాలను వేగంగా పెంచుతున్న సమయంలో లావ్రోవ్ సంచలన ప్రకటన చేశారు. ఇతర దేశాలు దీనిని సైనిక కూటమిగా మార్చాలని కోరుకుంటుండగా, భారతదేశం వాణిజ్యం, శాంతియుత సహకారం ఉద్దేశ్యంతో మాత్రమే ఈ వేదికతో అనుసంధానించాలని రష్యా విశ్వసిస్తుంది. భారతదేశంతో జరిగిన చర్చలలో, క్వాడ్‌లో భారత్ ప్రమేయం వాణిజ్యం, శాంతియుత ఆర్థిక అభివృద్ధి గురించి మాత్రమే అని రష్యాకు స్పష్టమైందని రష్యా మంత్రి లావ్‌రోవ్ అన్నారు. అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా వంటి ఇతర క్వాడ్ సభ్య దేశాలు క్రమంగా దానిని సైనిక కూటమిగా మార్చడానికి ప్రయత్నిస్తున్నాయని మంత్రి ఆరోపించారు. ఈ దేశాలు ఉమ్మడి నావికా విన్యాసాలు, భద్రతా సహకారం వంటి దశల ద్వారా పరిస్థితిని సైనిక దిశలో మార్చాలని కోరుకుంటున్నాయన్నారు. రష్యా-చైనా మధ్య నమ్మకం, సహకారం ఆధారంగా లోతైన సంబంధాలు ఉన్నాయని లావ్రోవ్ అన్నారు. రెండు దేశాలు బహుళ ధ్రువ ప్రపంచానికి మద్దతుదారులు, ఇక్కడ ఏ ఒక్క దేశానికీ ఆధిపత్యం లేదు. సెప్టెంబర్‌లో చైనాలో జరిగే 80వ విజయోత్సవ వేడుకలకు పుతిన్ హాజరవుతారని ఆయన స్పష్టం చేశారు. మరింత న్యాయమైన, స్థిరమైన కొత్త ప్రపంచ క్రమాన్ని నిర్మించడానికి రష్యా-చైనా కలిసి పనిచేస్తున్నాయని లావ్రోవ్ అన్నారు. రెండు దేశాలు ఐక్యరాజ్యసమితి చార్టర్ సూత్రాలను పూర్తిగా అమలు చేయాలని సమర్థిస్తాయి. ఉగ్రవాదం, నాజీయిజం, ఏకపక్ష ఆంక్షలు వంటి ఆధునిక నవ-వలసవాద వ్యూహాలను



వ్యతిరేకిస్తాయి. భద్రత అనే భావన అందరికీ ఒకేలా ఉండే వ్యవస్థను సృష్టించడం వారి లక్ష్యమని రష్యా మంత్రి లావ్‌రోవ్ స్పష్టం చేశారు. RIC ఫోరం మళ్లీ క్రియాశీలకంగా మారితే, అది అమెరికా నేతృత్వంలోని కూటముల ప్రభావాన్ని సమతుల్యం చేయడమే కాకుండా ఆసియాలో వాణిజ్యం, భద్రత, దౌత్యానికి కొత్త మార్గాలను తెరుస్తుందని రష్యా మంత్రి లావ్‌రోవ్ అన్నారు. భారతదేశం విషయానికొస్తే, ఇది సమతుల్య వ్యూహంలో భాగం కావచ్చు. ఇక్కడ అది పశ్చిమ-తూర్పు దేశాలతో తన ప్రయోజనాలను కొనసాగించగలదు. లావ్రోవ్ చేసిన ఈ ప్రకటన అంతర్జాతీయ వర్గాలలో అమెరికా దౌత్యపరమైన అంచు ఇప్పుడు కఠినమైన సవాలును ఎదుర్కోబోతోందా అనే కొత్త చర్చకు దారితీసింది.

# ఆపరేషన్ సింధూర్ ఇంకా ముగియలేదు.. శత్రువు ఎక్కడున్నా వదిలేదీ లేదుః మోదీ

ఆపరేషన్ సింధూర్ ఇంకా ముగియలేదు. ఉగ్రవాదంపై పోరాటంలో భారతదేశం ఎక్కడికైనా దూసుకువెళ్తుందని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. కాన్పూర్‌లో జరిగిన సభలో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ, ఈ అభివృద్ధి కార్యక్రమం ఏప్రిల్ 24న కాన్పూర్‌లో జరగాల్సి ఉండగా, పహల్గామ్ దాడి కారణంగా కాన్పూర్ పర్యటన రద్దు చేయాల్సి వచ్చిందని ప్రధాని అన్నారు. పహల్గామ్ ఉగ్రవాద దాడిలో కాన్పూర్ బిడ్డ శుభం ద్వివేది కూడా ఉగ్రవాదుల క్రూరత్వానికి బలైయ్యాడు. కూతురు ఐష్ణయ బాధను మనమందరం పంచుకోవాలి. ఆపరేషన్ సింధూర్ రూపంలో మన కుమార్తెలు, సోదరీమణుల కోపాన్ని ప్రపంచం మొత్తం చూసిందని ప్రధాని మోదీ అన్నారు. పాకిస్తాన్‌లోని ఉగ్రవాదుల రహస్య స్థావరాలలోకి చొచ్చుకువెళ్లి, వారిని నాశనం చేశామని ప్రధాని మోదీ అన్నారు. మన సైన్యం ఎంత పరాక్రమం ప్రదర్శించిందంటే, పాకిస్తాన్ సైన్యం యుద్ధాన్ని ఆపమని వేడుకోవలసి వచ్చిందన్నారు. ఈ స్వాతంత్ర్య పోరాట భూమి నుండి, భారత సైన్యం ధైర్యసాహసాలకు పదే పదే సెల్యూట్ చేస్తున్నానని ప్రధాని మోదీ అన్నారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో వేడుకున్న శత్రువు ఎలాంటి భ్రమలో ఉండకూడదని పునరుద్ఘాటించారు. ఆపరేషన్ సింధూర్ ఇంకా ముగియలేదు. ఉగ్రవాదంపై పోరాటంలో భారతదేశం మూడు సూత్రాలను నిర్దేశించుకుందని ప్రధాని మోదీ తెలిపారు. ముందుగా- ప్రతి ఉగ్రవాద దాడికి భారతదేశం తగిన సమాధానం ఇస్తుంది. దాని సమయం, పద్ధతి, పరిస్థితులను మన త్రివిధ దళాలు నిర్ణయిస్తాయి. రెండవది, భారతదేశం ఇకపై అణు బాంబు బెదిరింపులకు భయపడదు. దాని ఆధారంగా ఎవరూ ఎటువంటి నిర్ణయం తీసుకోరు. మూడవది, భారతదేశం ఉగ్రవాదానికి అధిపతిని, ఉగ్రవాదాన్ని పోషించే ప్రభుత్వాన్ని ఒకే దృష్టితో చూస్తుంది. పాకిస్తాన్ రాజ్య, రాజ్యేతర శక్తుల ఆటలు ఇక పనిచేయవు. సరళంగా చెప్పాలంటే కాన్పురియాలో, శత్రువు ఎక్కడికైనా భయపడి తరిమివేసతామని ప్రధాని మోదీ అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో, భారతదేశ స్వదేశీ ఆయుధాల బలాన్ని, మేక్ ఇన్ ఇండియా సత్తాను ప్రపంచం చూసిందని ప్రధానమంత్రి మోదీ అన్నారు. మన భారత ఆయుధాలు, బ్రహ్మోస్ క్షిపణి శత్రువుల భూభాగంలోకి ప్రవేశించి విధ్వంసం సృష్టించాయి. లక్ష్యాలను నిర్ణయించిన చోట పేలుళ్లు జరిగాయి. స్వావలంబన భారతదేశం అనే సంకల్పం నుండి మనకు ఈ బలం లభించిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రక్షణ రంగంలో స్వావలంబనలో పెద్ద పాత్ర పోషిస్తుండటం మొత్తం రాష్ట్రానికే గర్వకారణమని ప్రధానమంత్రి అన్నారు. కాన్పూర్‌లో ఒక పాత ఆయుధ కర్మాగారం ఉన్నట్లుగానే,



అటువంటి 7 ఆయుధ కర్మాగారాలను పెద్ద ఆధునిక కంపెనీలుగా మార్చామన్నారు. నేడు దేశంలోనే అతిపెద్ద రక్షణ కారిడార్ ఉత్తరప్రదేశ్‌లో నిర్మిస్తున్నారు. ఒకప్పుడు అక్కడి నుండి పరిశ్రమలు వలస వస్తున్న సమయంలో, ఇప్పుడు రక్షణ రంగానికి చెందిన పెద్ద కంపెనీలు అక్కడికి వస్తున్నాయని ప్రధాని వెల్లడించారు. పెద్ద మెట్రో నగరాల్లో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు, అన్ని వనరులు ఇప్పుడు మన కాన్పూర్‌లో కనిపిస్తున్నాయని ప్రధాని మోదీ అన్నారు. సరైన ఉద్దేశాలు, దృఢ సంకల్పం, మంచి ఉద్దేశాలు కలిగిన ప్రభుత్వం ఉంటే దేశం, రాష్ట్ర అభివృద్ధికి ఎంత నిజాయితీగా కృషి చేయవచ్చో కాన్పూర్ మెట్రో ఒక నిదర్శనమన్నారు.ప్రధానమంత్రి మోదీ తన పర్యటన సందర్భంగా కాన్పూర్‌కు పెద్ద బహుమతిని ఇచ్చారు. 47 వేల 600 కోట్ల రూపాయలకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. కాన్పూర్ మెట్రో రైలు ప్రాజెక్టులోని చున్నిగంజ్ నుండి కాన్పూర్ సెంట్రల్ వరకు కొత్త భూగర్భ విభాగాన్ని ప్రారంభించారు. ఈ విభాగంలో 5 కొత్త భూగర్భ స్టేషన్లు (చున్నిగంజ్, బడా చౌరాహా, నవీన్ మార్కెట్, నయగంజ్, కాన్పూర్ సెంట్రల్) ఉన్నాయి. కాన్పూర్ మెట్రో విస్తరణతో, లాల్ ఇమ్లి, జెడ్ స్క్వేర్ మాల్, గ్రీన్ పార్క్ స్టేడియం, పరేడ్ గ్రౌండ్, బుక్ మార్కెట్, సోమ్‌దత్ ప్లాజా వంటి ముఖ్యమైన ప్రదేశాలు నేరుగా మెట్రోకు అనుసంధానించడం జరుగుతుంది. ప్రస్తుతం, ఐఐటీ కాన్పూర్ నుండి మోతీజీల్ వరకు 9 స్టేషన్లు పనిచేస్తున్నాయి. ఇక అలాగే, ఘటంపూర్‌లో 660 మెగావాట్ల విద్యుత్ యూనిట్‌ను, పాంకిలో థర్మల్ విద్యుత్ ప్రాజెక్టును కూడా ప్రధాని ప్రారంభించారు.

# ట్రంప్ సర్కార్ తీసుకుంటున్న చర్యలతో.. అమెరికా ఆదాయానికి భారీగా కోత!

విదేశీ విద్యార్థులకు వీసాలంటేనే చిర్రెత్తిపోతున్నారు అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్. రోజుకో రీతిలో ఆ వీసాలకు ఎసరు పెట్టేందుకు ఆలోచనలు చేస్తున్నారు. ఇప్పటికే అనేక మార్గాల్లో విదేశీ విద్యార్థుల సంఖ్యకు కోత పెట్టేందుకు చర్యలు చేపట్టిన ట్రంప్.. ఇప్పుడు వర్సిటీల్లో 15 శాతం పరిమితిని విధిస్తామని స్పష్టం చేశారు. మరోవైపు సోషల్‌మీడియాలో క్లీన్‌చిట్ ఉంటేనే అమెరికాకు ఎంట్రీ ఉంటుందని ఇప్పటికే ప్రకటించింది అమెరికా ప్రభుత్వం.ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే వీసా కట్..క్లాస్‌లకు బంక్ కొడితే వీసా కట్.. సోషల్ మీడియాలో వ్యతిరేకంగా పోస్ట్ పెడితే వీసా కట్.. ఇలా అమెరికాలో విదేశీ విద్యార్థులను తగ్గించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు అధ్యక్షుడు ట్రంప్. ఇతర దేశాల నుంచి చదువు కోసం వస్తున్న విద్యార్థులు అమెరికాలో సమస్యలు సృష్టిస్తున్నారన్న ట్రంప్.. హార్వర్డ్ యూనివర్సిటీతో పాటు ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో విదేశీ విద్యార్థులపై 15 శాతం పరిమితి విధిస్తామని స్పష్టం చేశారు. విదేశీ విద్యార్థులు కారణంగా స్థానిక అమెరికన్ విద్యార్థులు మెరుగైన విద్యను పొందలేకపోతున్నారని మండిపడ్డారు. దేశ వ్యతిరేక భావజాలానికి కొన్ని వర్సిటీలు కేంద్రంగా మారుతున్నాయని ఆరోపించారు. అందుకోసమే విద్యార్థుల వీసాలపై పరిమితి విధిస్తామని స్పష్టం చేశారు. అమెరికాలోని కొన్ని యూనివర్సిటీల ఆవరణల్లో ఇటీవల పాలస్తీనాకు మద్దతుగా పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి. ఈ విషయాన్ని మనసులో పెట్టుకొని ట్రంప్ సర్కారు విదేశీ విద్యార్థులపై ఆగ్రహంగా ఉంది. ఈ క్రమంలోనే పలు కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది.అమెరికాలో ప్రస్తుతం 11 లక్షలకు పైగా విదేశీ విద్యార్థులు ఉన్నారు. వీరిలో 3 లక్షల మంది భారతీయ విద్యార్థులే. ట్రంప్ తీసుకుంటున్న వరుస నిర్ణయాలతో ఇప్పటికే అక్కడ ఉన్న విద్యార్థులతో పాటు అమెరికాలో చదవాలని ప్రణాళికలు వేసుకుంటున్న విద్యార్థులకు కూడా ఇబ్బందులు కలుగుతున్నాయి. అమెరికాలో చదువు కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థుల వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగ్‌ను ఇప్పటికే తాత్కాలికంగా నిలిపివేసింది అమెరికా ప్రభుత్వం. దాంతో పాటు సోషల్ మీడియా వెట్టింగ్‌ను తెరపైకి తెచ్చింది. అమెరికాలో చదువుకోవడానికి



దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల సోషల్ మీడియా ప్రొఫైళ్లను క్షుణంగా పరిశీలిస్తారు. ఆ తర్వాతే వారికి వీసా మంజూరు చేస్తారు. అప్పటివరకు విద్యార్థులకు వీసా ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్లను నిలిపివేశారు. ఉగ్రవాదులను నియంత్రించడం, యూదు వ్యతిరేకతను ఎదుర్కోవడమే లక్ష్యంగా ఈ తనిఖీ చేస్తున్నట్టు అమెరికా ప్రకటించింది.తాజా మరో ఉత్తర్వులు జారీ చేసింది ట్రంప్ సర్కార్. హార్వర్డ్ యూనివర్సిటీకి ఏ ప్రయోజనం కోసం వెళ్లాలనుకునే వీసా దరఖాస్తుదారుల అదనపు పరిశీలనను ప్రారంభించాలని అమెరికా విదేశాంగ శాఖ విదేశాల్లోని తన అన్ని కాన్సులర్ మిషన్లను ఆదేశించింది. దరఖాస్తుదారులలో విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, గెస్ట్ స్పీకర్లు, పర్యాటకులు కూడా ఉన్నారు. కానీ వారికి మాత్రమే పరిమితం కాదని తెలుస్తోంది. 'సోషల్ మీడియా వెట్టింగ్' విదేశీ విద్యార్థుల వీసా ప్రక్రియపై పెను ప్రభావం చూపనుంది. దీంతో అమెరికా యూనివర్సిటీలపై ఆర్థికంగానూ భారం పడనుంది. 2024లో 2.7 లక్షలకు పైగా నమోదైన భారత విద్యార్థులతో అమెరికా ఆర్థిక వ్యవస్థకు 43.8 బిలియన్ డాలర్ల ఆదాయం వచ్చింది. ఇప్పుడు ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఈ ఆదాయానికి భారీగా కోతపడుతుందని వర్సిటీలు ఆందోళన చెందుతున్నాయి.మరోవైపు ఇటీవల హార్వర్డ్ యూనివర్సిటీకి అందించే నిధుల్లో ట్రంప్ ప్రభుత్వం కోత విధించింది. ఆ తర్వాత ఏకంగా విదేశీ విద్యార్థులను చేర్చుకోవడానికి ఉన్న అనుమతిని రద్దు చేసింది. దీన్ని వ్యతిరేకిస్తూ యూనివర్సిటీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ట్రంప్ చర్య అనైతికమని నిబంధనలు ఉల్లంఘించడం అవుతుందని హార్వర్డ్ పేర్కొంది. దీనిపై విచారణ జరిపిన ఫెడరల్ కోర్టు న్యాయమూర్తి.. ట్రంప్ నిర్ణయాన్ని నిలుపుదల చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

# చరిత్ర సృష్టించిన ఇంగ్లండ్.. ప్రపంచ క్రికెట్‌లో తొలి జట్టుగా



పాయింట్ల పట్టికలో మెరుగైన స్థానంలో ఉన్న జట్టు ఫైనల్‌కు అర్హత సాధిస్తోంది. అంటే పాయింట్ల పట్టికలో టాప్ ప్లేస్‌లో ఉన్న పంజాబ్ కింగ్స్ ఫైనల్లో అడుగుపెడుతోంది. ముంబై పాయింట్ల టేబుల్‌లో నాలుగో స్థానంలో ఉంది. అయితే వర్షం ముప్పు పొంచిలేదు. వెధర్.కామ్ ప్రకారం.. 24 శాతం మాత్రమే వర్షం పడేందుకు ఆస్కారం ఉంది. దీంతో మ్యాచ్ సజావుగా జరిగనుంది. కాగా ఫైనల్ మ్యాచ్ మాత్రం బీసీసీఐ రిజర్వ్ డే కేటాయించింది. జూన్ 3న ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

తుది జట్లు(అంచనా)

ముంబై ఇండియన్స్: రోహిత్ శర్మ, జానీ బెయిర్‌స్టో (వికెట్‌కీపర్), సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా (కెప్టెన్), నమన్ ధీర్, రాజ్ బావా, మిచెల్ సాంట్నర్, ట్రెంట్ బౌల్ట్, జస్ప్రీత్ బుమ్రా, రిచర్డ్ గ్లీసన్

ఆర్సీబీ: విరాట్ కోహ్లి, ఫిలిప్ సాల్ట్, రజత్ పాటిదార్ (కెప్టెన్), లియామ్ లివింగ్‌స్టోన్, జితేష్ శర్మ (వికెట్ కీపర్), రొమారియో షెపర్డ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, యశ్ దయాల్, జోష్ హేజిల్‌వుడ్, సుయాష్ శర్మ

అలా జరిగితే ముంబై ఇండియన్స్ ఇంటికే?

ఐపీఎల్-2025లో క్వాలిఫయర్-2కు రంగం సిద్ధమైంది. జూన్ 1(ఆదివారం) జరగనున్న సెకెండ్ క్వాలిఫయర్‌లో పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ జట్లు అమీతుమీ తెల్చుకోనున్నాయి. 2014 తర్వాత తొలిసారి ఫైనల్‌కు చేరుకునేందుకు పంజాబ్ ప్రయత్నిస్తుండగా.. ముంబై ఇండియన్స్ ఆరో ఐపీఎల్ టైటిల్ లక్ష్యంగా పెట్టుకుంది. క్వాలిఫయర్-1, ఎలిమినేటర్ మ్యాచ్‌లకు మొహాలీలోని ముల్లాన్‌పూర్ స్టేడియం ఆతిథ్యమివ్వగా.. ఇప్పుడు క్వాలిఫయర్-2, ఫైనల్ మ్యాచ్‌లు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరగనున్నాయి.

క్వాలిఫయర్-2 రద్దు అయితే?

ఇక క్వాలిఫయర్-2 మ్యాచ్ వర్షం లేదా ఏదైనా కారణం వల్ల రద్దు అయితే ఏంటి పరిస్థితి అని ఇరు జట్ల అభిమానులు తెగ టెన్షన్ పడుతున్నారు. ఈ మ్యాచ్‌కు బీసీసీఐ రిజర్వ్ డే కేటాయించలేదు. దీంతో వర్షం లేదా వేరే ఇతర కారణం చేత మ్యాచ్ రద్దు అయితే..

# SPORTS

## రషీద్ ఖాన్ అత్యంత చెత్త రికార్డు.. ఐపీఎల్ చరిత్రలోనే



రషీద్ ఖాన్.. ప్రపంచంలోనే అత్యుత్తమ స్పిన్నర్లలో ఒకడిగా పేరు గాంచాడు. తన స్పిన్ మయాజాలంతో ప్రత్యర్థులను ముప్పు తిప్పలు పెట్టే సత్తా ఉన్నోడు రషీద్. కానీ ఐపీఎల్-2025లో మాత్రం రషీద్ తన మార్క్‌ను చూపించలేకపోయాడు. ఈ ఏడాది సీజన్‌లో అఫ్గాన్ స్టార్ స్పిన్నర్ దారుణంగా విఫలమయ్యాడు. ప్రతీ మ్యాచ్‌లోనూ భారీగా పరుగులు సమర్పించుకుంటూ జట్టుకు భారంగా మారాడు. శుక్రవారం ముంబై ఇండియన్స్‌తో జరిగిన ఎలిమినేటర్‌లోనూ అదే తీరును కనబరిచాడు. తన నాలుగు ఓవర్లలో కోటాలో వికెట్ ఏమీ తీయకుండా 31 పరుగులు ఇచ్చాడు. ఓవరాల్‌గా ఈ ఏడాది సీజన్‌లో 15 మ్యాచ్‌లు ఆడిన రషీద్.. 9.34 ఏకానమితో కేవలం 9 వికెట్లు మాత్రమే పడగొట్టాడు.

రషీద్ ఖాన్ చెత్త రికార్డు..

ఈ క్రమంలో రషీద్ ఖాన్ అత్యంత చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఒక ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు సమర్పించుకున్న బౌలర్‌గా రషీద్ అప్రతిష్టను మూటకట్టుకున్నాడు. ఈ ఏడాది సీజన్‌లో రషీద్ ఏకంగా 33 సిక్సర్లు ఇచ్చాడు. ఇప్పటివరకు ఈ రికార్డు టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ పేరిట ఉండేది. 2022 ఐపీఎల్ సీజన్‌లో ఆర్సీబీకి ప్రాతినిథ్యం వహిస్తూ సిరాజ్ 31 సిక్సర్లు ఇచ్చాడు. తాజా మ్యాచ్‌లో రెండు సిక్సర్లు ఇచ్చిన రషీద్.. సిరాజ్‌ను అధిగమించాడు. వీరిద్దరి తర్వాత స్థానాల్లో చాహల్(30), హసరంగా(30),బ్రావో ఉన్నారు. కాగా ఎలిమినేటర్ మ్యాచ్‌లో 20 పరుగుల తేడాతో గుజరాత్ ఓటమి పాలైంది.

## అదే మా కొంపముంచింది.. అతడు మాత్రం నిజంగా అద్భుతం: గిల్



ఐపీఎల్-2025లో గుజరాత్ టైటాన్స్ ప్రయాణం ముగిసింది. శుక్రవారం ముల్లాన్‌పూర్ వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన ఎలిమినేటర్‌లో 20 పరుగుల తేడాతో ఓటమి పాలైన గుజరాత్.. ఈ టోర్నీ నుంచి ఇంటిముఖం పట్టింది. 229 పరుగుల భారీ లక్ష్యాన్ని చేధించడంలో గుజరాత్ విఫలమైంది. సాయిసుదర్శన్(81), వాషింగ్టన్ సుందర్(48) అద్భుత ఇన్నింగ్స్‌లు ఆడినప్పటికీ మిగితా బ్యాటర్లు తేలిపోవడంతో గుజరాత్ ఓటమి చవిచూడాల్సి వచ్చింది. లక్ష్య చేధనలో టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేయగల్గింది. ఇక ఈ హార్ట్‌బ్రేకింగ్ ఓటమిపై మ్యాచ్ అనంతరం గుజరాత్ కెప్టెన్ శుబ్‌మన్ గిల్ స్పందించాడు.

తమ పేలవ ఫీల్డింగ్ కారణంగానే ఓడిపోయాము అని గిల్ తెలిపాడు. "క్రికెట్ అనేది నిజంగా ఒక అద్భుతమైన గేమ్. ఎప్పుడు ఏమి జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. ఈ మ్యాచ్‌లో మేము ఆఖరి వరకు పోరాడి ఓడిపోయాము. చివరి మూడు, నాలుగు ఓవర్లలో మాకు కలిసి రాలేదు. అయినప్పటికి మేము బాగానే ఆడాము. కచ్చితంగా క్యాచ్‌లు మ్యాచ్ ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఈ మ్యాచ్‌లో మేము మూడు సునాయస క్యాచ్‌లు జారవిడిచాము. ఈజీగా క్యాచ్‌లను వదిలిస్తే బౌలర్లకు పరుగులను నియంత్రించడం అంత సులభం కాదు. సాయిసుదర్శన్, వాషింగ్టన్ సుందర్‌కు మేము ఒకటే మెసేజ్ పంపాము. ఎలాంటి ఒత్తిడి లేకుండా పూర్తిగా స్వేచ్ఛగా ఆడాలని వారికి చెప్పాం. జట్టును గెలిపించడమే వారద్దరి లక్ష్యం. మంచు కారణంగా వికెట్ కూడా బ్యాటింగ్‌కు అనుకూలంగా మారింది.

ఈ సీజన్‌లో మాకు చాలా సానుకూల అంశాలు ఉన్నాయి. గత మూడు మ్యాచ్‌లలో మేము స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయాము. కానీ జట్టులోని ప్రతీ ఒక్కరూ కూడా మెరుగ్గా రాణించారు. ముఖ్యంగా సాయిసుదర్శన్ ఒక అద్భుం. ఈ సీజన్‌లో అతడు ఆసాధరణ ప్రదర్శన కనబరిచాడు అని పోస్ట్ మ్యాచ్ ప్రెజెంటేషన్‌లో గిల్ పేర్కొన్నాడు.

## పంజాబ్ కింగ్స్‌ను భయపెడుతోన్న రోహిత్ వజ్రాయుధం.. ఇప్పటికే 4 జట్లు బలి..



: ఐపీఎల్ 2025 లీగ్ దశ ముగిసి, ప్లేఆఫ్స్ సందడి మొదలయ్యింది. ఈ సీజన్‌లో ముంబై ఇండియన్స్ జట్టు ప్లేఆఫ్స్‌కు చేరుకోవడంలో, ముఖ్యంగా కీలకమైన మ్యాచ్‌లలో విజయం సాధించడంలో రోహిత్ శర్మ పాత్ర ఎంతో కీలకమైనది. కెప్టెన్సీ భారం లేకపోయినా, ఒక ఓపెనర్‌గా రోహిత్ అద్భుతమైన ఫామ్‌ను కనబరిచాడు. రోహిత్ ఇప్పటివరకు నాలుగు అర్ధ సెంచరీలు సాధించి, నాలుగు ప్రత్యర్థి జట్లను టోర్నమెంట్ నుంచి నిష్క్రమించడంలో పరోక్షంగా తన వంతు సహకారం అందించాడు. ఇప్పుడు క్వాలిఫైయర్ 2లో పంజాబ్ కింగ్స్‌తో తలపడేందుకు సిద్ధంగా ఉన్న ముంబై ఇండియన్స్ ఆశలన్నీ మరోసారి 'హిట్‌మ్యాన్' మీదే ఉన్నాయి. ఈ సీజన్‌లో రోహిత్ శర్మ 14 మ్యాచ్‌లలో 410 పరుగులు సాధించాడు. రోహిత్ అత్యధిక స్కోరు 81. ఎలిమినేటర్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ పై సాధించిన ఈ 81 పరుగుల ఇన్నింగ్స్, ముంబై ఇండియన్స్‌ను క్వాలిఫైయర్ 2కు చేర్చడంలో ప్రధాన పాత్ర పోషించింది. గుజరాత్ టైటాన్స్‌ను ఓడించి, ఆ జట్టును టోర్నమెంట్ నుంచి బయటకు పంపిన సంగతి తెలిసిందే. దీంతో రోహిత్‌ఈ ఫామ్ ప్రత్యర్థి జట్లకు ఆందోళన కలిగిస్తోంది. క్వాలిఫైయర్ 1లో పంజాబ్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో ఘోర పరాజయం పాలైంది.

ఇప్పుడు ఫైనల్‌కు చేరుకోవాలంటే పంజాబ్, ముంబై ఇండియన్స్‌ను ఓడించాల్సి ఉంటుంది. రోహిత్ శర్మ ఈ సీజన్‌లో సాధించిన నాలుగు అర్ధ సెంచరీలలో, రెండు కీలకమైన మ్యాచ్‌లలో వచ్చాయి. చెన్నై సూపర్ కింగ్స్ సన్‌రైజర్స్ హైదరాబాద్ పై అతను మెరుగైన ప్రదర్శన కనబరిచాడు. రాజస్థాన్ రాయల్స్ పై కూడా అర్ధ సెంచరీతో రాణించాడు. రోహిత్ శర్మ ఐపీఎల్ కెరీర్‌లో 7000 పరుగులు, 300 సిక్సర్ల మైలురాళ్లను కూడా ఈ సీజన్‌లో అధిగమించాడు. ఇది అతని అనుభవాన్ని, ఫామ్‌ను స్పష్టం చేస్తుంది.

ముఖ్యంగా ప్లేఆఫ్స్ లాంటి ఒత్తిడితో కూడుకున్న మ్యాచ్‌లలో రోహిత్ వంటి అనుభవజ్ఞుడు జట్టుకు ఎంతో అవసరం. గత ఎలిమినేటర్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ బౌలర్లను చిత్తు చేస్తూ ఆడిన తీరు, పంజాబ్ కింగ్స్‌కు గట్టి హెచ్చరిక అనడంలో ఎలాంటి సందేహం లేదు. పంజాబ్ కింగ్స్ జట్టు క్వాలిఫైయర్ 1 ఓటమి తర్వాత తీవ్ర ఒత్తిడిలో ఉంది. ఆజట్టుకు రోహిత్ శర్మ ప్రస్తుత ఫామ్ మరింత ఆందోళన కలిగిస్తోంది. ముంబై ఇండియన్స్ బ్యాటింగ్ లైనప్ బలంగా ఉన్నప్పటికీ, రోహిత్ ఇచ్చే శుభారంభం, జట్టుకు భారీ స్కోరు సాధించడంలో, ఛేదించడంలో ఎంతో సహాయపడుతుంది. పంజాబ్ కింగ్స్ తమ బౌలింగ్‌తో రోహిత్‌ను ఎలా కట్టడి చేస్తుందో చూడాలి. ముఖ్యంగా అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం రోహిత్ శర్మకు అంతగా కలిసి రాలేదు. ఈ స్టేడియంలో ఏడు ఇన్నింగ్స్‌లలో 150 పరుగులు మాత్రమే చేశాడు, సగటు 21.42గా ఉంది. ఇది పంజాబ్‌కు కాస్త ఆశాజనకంగా ఉన్నప్పటికీ, రోహిత్ ఒకసారి క్రీజ్‌లో నిలబడితే అతనిని ఆపడం కష్టం. మొత్తం మీద, రోహిత్ శర్మ ఫామ్‌తో ముంబై ఇండియన్స్ క్వాలిఫైయర్ 2లో పంజాబ్ కింగ్స్‌కు గట్టి సవాల్ విసిరేందుకు సిద్ధంగా ఉంది.

ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌లో ఎవరు పైచేయి సాధిస్తారో, ఫైనల్‌కు ఎవరు వెళ్తారో చూడాలి. పంజాబ్ కింగ్స్‌కు ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మను అడ్డుకోవడం అనేది ఒక పెద్ద పరీక్ష కానుంది.

## ముంబై, పంజాబ్ మ్యాచ్‌కు వర్షం ఎఫెక్ట్.. క్వాలిఫైయర్ 2 రద్దయితే బెంగళూరును ఢీ కొట్టే జట్టు ఇదే..!

: ఐపీఎల్ 2025 ప్లేఆఫ్స్ ఉత్కంఠ చివరి దశకు చేరుకుంది. ఇప్పటికే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు క్వాలిఫైయర్ 1లో విజయం సాధించి నేరుగా ఫైనల్‌కు చేరుకోగా, గుజరాత్ టైటాన్స్‌పై ఎలిమినేటర్‌లో గెలిచిన ముంబై ఇండియన్స్ క్వాలిఫైయర్ 2లో పంజాబ్ కింగ్స్‌ను ఢీకొననుంది.

ఈ మ్యాచ్ (క్వాలిఫైయర్ 2) అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జూన్ 1, 2025న జరగనుంది. ఈ కీలక మ్యాచ్‌కు వర్షం లేదా ఇతర అంతరాయాలు ఏర్పడితే ఎలాంటి నిబంధనలు వర్తిస్తాయి, రిజర్వ్ డే ఉందా లేదా అన్నది అభిమానుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.

క్వాలిఫైయర్ 2కు రిజర్వ్ డే ఉందా?

అవును, క్వాలిఫైయర్ 2, ఫైనల్ మ్యాచ్‌లకు రిజర్వ్ డే ఉంటుంది. ఐపీఎల్ నిబంధనల ప్రకారం, ప్లేఆఫ్స్ (క్వాలిఫైయర్ 1, ఎలిమినేటర్, క్వాలిఫైయర్ 2, ఫైనల్) మ్యాచ్‌లకు వర్షం లేదా ఇతర కారణాల వల్ల అంతరాయం ఏర్పడితే, నిర్దిష్ట నిబంధనలు వర్తిస్తాయి.

క్వాలిఫైయర్ 1, ఎలిమినేటర్, క్వాలిఫైయర్ 2 మ్యాచ్‌లకు రిజర్వ్ డే ఉండదు. ఫైనల్‌కు మాత్రమే రిజర్వ్ డే ఉంటుంది. సాధ్యమైనంత వరకు మ్యాచ్ పూర్తి చేయడానికి ప్రయత్నం: ముందుగా షెడ్యూల్ చేసిన రోజునే మ్యాచ్‌ను పూర్తి చేయడానికి అంపైర్లు అన్ని విధాలా ప్రయత్నిస్తారు.

ఇందుకోసం మ్యాచ్ ప్రారంభ సమయాన్ని ఆలస్యం చేయడం, ఓవర్లను కుదించడం వంటి చర్యలు తీసుకుంటారు. ఐపీఎల్ ప్లేఆఫ్ మ్యాచ్‌లకు సాధారణంగా 60 నిమిషాల అదనపు సమయం (వర్షం తర్వాత మ్యాచ్‌ను పూర్తి చేయడానికి) ఇస్తారు. అయితే, ఈ సంవత్సరం (2025) బీసీసీఐ ఈ సమయాన్ని 120 నిమిషాలకు పెంచింది. అంటే, వర్షం కారణంగా ఆలస్యం అయినప్పటికీ, మ్యాచ్‌ను పూర్తి చేయడానికి రెండు గంటల వరకు అదనపు సమయం ఉంటుంది.

కనీసం 5 ఓవర్ల మ్యాచ్: ఒక మ్యాచ్ ఫలితం రావా లంటే కనీసం ఇరు జట్లు ఐదు ఓవర్ల చొప్పున ఆడాలి.

ఈ ఐదు ఓవర్ల మ్యాచ్ కూడా సాధ్యం కాకపోతే, సూపర్ ఓవర్ ద్వారా విజేతను నిర్ణయించడానికి ప్రయత్నిస్తారు. సూపర్ ఓవర్: షెడ్యూల్ చేసిన రోజున ఐదు ఓవర్ల మ్యాచ్ కూడా సాధ్యపడకపోతే, సూపర్‌ఓవర్ ద్వారా విజేతను నిర్ణయించడానికి ప్రయత్నిస్తారు. సూపర్‌ఓవర్ రాత్రి 12:50 %ూవీ లోపు ప్రారంభం కావాలి.

మ్యాచ్ రద్దు అయితే ఫైనల్‌లో ఎవరు ఆడతారు?

ఐపీఎల్ నిబంధనల ప్రకారం, క్వాలిఫయర్-2 మ్యాచ్ వర్షం వల్ల లేదా మరేదైనా కారణం వల్ల రద్దు అయినా, రిజర్వ్ డేలో కూడా మ్యాచ్ సాధ్యం కాకపోతే, లీగ్ దశలో మెరుగైన ర్యాంకింగ్ ఉన్న జట్టు ఫైనల్‌కు చేరుకుంటుంది. ఈ సందర్భంలో, లీగ్ దశలో 19 పాయింట్లు, మెరుగైన నెట్ రన్ రేట్ (ం0.376)తో మొదటి స్థానంలో నిలిచిన పంజాబ్ కింగ్స్ ఫైనల్‌కు చేరుకుంటుంది.

దీని అర్థం పంజాబ్ కింగ్స్ ఫైనల్‌లో బెంగళూరుతో ఆడుతుందన్నమాట. ఒకవైపు ముంబై ఇండియన్స్ గుజరాత్ టైటాన్స్‌ను ఓడించి ఉత్సాహంగా ఉంది.

రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా వంటి ఆటగాళ్లతో ముంబై పటిష్టంగా కనిపిస్తోంది. మరోవైపు, పంజాబ్ కింగ్స్ క్వాలిఫైయర్ 1లో ఓడినప్పటికీ, లీగ్ దశలో అగ్రస్థానంలో నిలిచి పటిష్టమైన జట్టుగా నిరూపించుకుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఢీకొంటుంది. క్రికెట్ అభిమానులు ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌ను ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వరుణుడు ఆటంకం కలిగించకుండా, పూర్తి మ్యాచ్‌ను చూడాలని కోరుకుంటున్నారు. రిజర్వ్ డే ఉన్నప్పటికీ, ఆట షెడ్యూల్ ప్రకారం సాగి ఫలితం రావాలని అందరూ ఆశిస్తున్నారు.

## విజయానికి 24 పరుగులు.. చివరి ఓవర్‌లో అదిరిపోయే స్కెచ్.. కట్‌చేస్తే.. క్వాలిఫయిర్ 2కి ముంబై



: ఐపీఎల్ 2025 ఎలిమినేటర్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌పై ముంబై ఇండియన్స్ 20 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించి క్వాలిఫైయర్ 2కు చేరుకుంది. ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ ప్రదర్శించిన సమష్టి ఆటతీరు, ముఖ్యంగా చివరి ఓవర్‌లో అమలు చేసిన వ్యూహం అందరినీ ఆశ్చర్యపరిచింది. గుజరాత్ టైటాన్స్ విజయం కోసం చివరి ఓవర్‌లో 24 పరుగులు చేయాల్సిన పరిస్థితుల్లో, ముంబై కెప్టెన్ హార్దిక్ పాండ్యా ఇద్దరు బౌలర్లను ఉపయోగించి ప్రత్యర్థిని కట్టడి చేశాడు.

### అసలేం జరిగింది?

గుజరాత్ టైటాన్స్ ఛేదనలో చివరి ఓవర్ కీలకంగా మారింది. విజయానికి 24 పరుగులు కావాలి. ఈ సమయంలో ముంబై ఇండియన్స్ తరపున రిచర్డ్ గ్లీసన్ బౌలింగ్‌కు వచ్చాడు. అతను తన మొదటి మూడు బంతుల్లో 2 పరుగులు మాత్రమే ఇచ్చి, షారుఖ్ ఖాన్ వికెట్ తీసి మ్యాచ్‌ను పూర్తిగా ముంబై వైపు తిప్పాడు. అయితే, దురదృష్టవశాత్తు గ్లీసన్ ఆ ఓవర్‌ను పూర్తి చేయలేకపోయాడు. బౌలింగ్ వేస్తున్న సమయంలో అతనికి గాయం కావడంతో మైదానం వీడాల్సి వచ్చింది. దీంతో ఓవర్‌లో ఇంకా మూడు బంతులు మిగిలి ఉండగా, హార్దిక్ పాండ్యా అనూహ్య నిర్ణయం తీసుకున్నాడు. స్పిన్నర్ అశ్వినీ కుమార్‌కు మిగిలిన మూడు బంతులు వేయమని సూచించాడు. ఇది చాలా ధైర్యమైన నిర్ణయం, ఎందుకంటే చివరి ఓవర్లలో స్పిన్నర్లతో బౌలింగ్ చేయించడం చాలా అరుదుగా చూస్తుంటాం, ముఖ్యంగా తక్కువ మార్జిన్ ఉన్నప్పుడు.

### అశ్వినీ కుమార్ అద్భుత ప్రదర్శన..

అయితే, అశ్వినీ కుమార్ కెప్టెన్ నమ్మకాన్ని నిలబెట్టాడు. అతను ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొని, అద్భుతమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బంతులు వేశాడు. మిగిలిన మూడు బంతుల్లో కేవలం 2 పరుగులు మాత్రమే ఇచ్చి, గుజరాత్ బ్యాటర్లను కట్టడి చేశాడు. రషీద్ ఖాన్ వికెట్ కూడా తీశాడు. ఈ వ్యూహాత్మక మార్పు, అశ్వినీ కుమార్ సమర్థవంతమైన బౌలింగ్‌తో ముంబై ఇండియన్స్ గుజరాత్ టైటాన్స్‌ను 208 పరుగులకే కట్టడి చేసి 20 పరుగుల తేడాతో విజయం సాధించింది.

### నిర్ణయం వెనుక వ్యూహం..

ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ బౌలర్లు డ్యూ ప్రభావంతో బంతిని నియంత్రించడానికి ఇబ్బంది పడినప్పటికీ, బుమ్రా 1/27తో అద్భుతమైన బౌలింగ్ చేశాడు. హార్దిక్ పాండ్యా కూడా తన బౌలింగ్ మార్పులతో చురుగ్గా ఉన్నాడు. చివరి ఓవర్‌లో గ్లీసన్ గాయం అయినప్పటికీ, అశ్వినీ కుమార్‌ను తీసుకురావడం ఒక అద్భుతమైన వ్యూహం. ఇది ఐపీఎల్ ప్లేఆఫ్ చరిత్రలో ఒక అరుదైన దృశ్యం అని చెప్పవచ్చు. ముంబై ఇండియన్స్ ఆటగాళ్లు, ముఖ్యంగా బౌలర్లు, ఒత్తిడిలోనూ తమ ప్రదర్శనను నిలబెట్టుకోవడం ద్వారా ఈ విజయం సాధించారు. రోహిత్ శర్మ 81 పరుగులతో అద్భుతమైన బ్యాటింగ్‌తో జట్టుకు భారీ స్కోరు అందించగా, బౌలర్లు సమష్టిగా రాణించి గుజరాత్ టైటాన్స్‌ను కట్టడి చేశారు. ఈ విజయం ముంబై ఇండియన్స్‌కు క్వాలిఫైయర్ 2లో పంజాబ్ కింగ్స్‌ను ఎదుర్కోవడానికి కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది.

